విశాఖపట్టణం
శుక్రవారం 4 సెప్టెంబర్ 2026

For a pure tomorrow..

# జయజయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 203 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## కిలో ఉల్లి రూ. 35కే

మార్కెట్ కంటే రూ.10 తక్కువకే అమ్మాలి

ధరల పెరుగుదలపై ఉపసంఘం

నియంత్రణపై కేబినెట్ కమిటీ అధ్యయనం



2



## ప్రొటోకాల్ ఉల్లంఘన సహించం

ప్రభుత్వ ప్రకటనల్లో పాటించాల్సిందే

వెలిగొండ, పోలవరం ఎల్ఎంసీలో

రామానాయుడు ఫొటో లేదేం

ఇకపై సమన్వయంతో పని చేయాల్సిందే

అధికారులపై సీఎం చంద్రబాబు నాయుడు సీరియస్

(అమరావతి - జయజయహే)

సమన్వయ లోపంతో వివిధ కార్యక్రమాలకు ప్రొటోకాల్ ఉల్లంఘన జరుగుతుండటంపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో సంబంధిత శాఖ మంత్రుల ఫొటోలు లేకపోవటం సరికాదన్నారు. వెలిగొండ, పోలవరం ఎల్ఎంసీ ప్రకటనల్లో మంత్రి రామానాయుడు ఫొటో లేకపోవటాన్ని ఆయన తప్పుబట్టారు. తప్పులు పునరావృతం ..మిగతా 2లో

# పొగాకు, పౌల్ట్రీ రైతులకు ఊతం

సీఆర్డీఏ ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్

కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు





(అమరావతి - జయజయహే)

సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో గురువారం క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ నిర్ణయాలను మంత్రి కొలుసు పార్థసారధి మీడియాకు వివరించారు. 2026--27 మార్కెటింగ్ సీజన్‌లో తోతాపురి మామిడికి మద్దతు ధర అమలు చేసేందుకు అవసరమైన నిధులను వర్కింగ్ క్యాపిటల్ ద్వారా సమీకరించుకునేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార మార్కెటింగ్ సమాఖ్య లిమిటెడ్ కు అనుమతిని పొడిగిస్తూ మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది. 2026 సీజన్‌లో 94 మిలియన్ కిలోల తక్కువ రకం, నాణ్యత లేని పొగాకు కొనుగోలుకు ధరల లోటు భర్తీ మద్దతుగా కిలోకు రూ.10 చొప్పున పొగాకు రైతులకు నేరుగా నగదు బదిలీ ద్వారా అందించేందుకు ఏపీ మార్క్ ఫెడ్‌కు రూ.94 కోట్ల నిధులను సమకూర్చే ప్రతిపాదనకు క్యాబినేట్ ఆమోదం తెలిపింది. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో రూ.624.88 లక్షల విలువైన 78 వరద నష్ట పునరుద్ధరణ పనులకు పాలనా ఆమోదం తెలిపింది. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టులోని టన్నెల్--2లో కిలోమీటర్ 11.847 వద్ద ఉన్న టన్నెల్ బోరింగ్ మెషీన్ ను డిస్మాంట్లింగ్ చేసే పనులను, ప్రస్తుతం ప్రాజెక్టులో 18.787 కి.మీ. మేర పనులు చేపడుతున్న మెస్సర్స్ మేఘా సంస్థకు అప్పగించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పనులకు రూ.11.63 కోట్ల ..మిగతా 2లో

# స్థానికంపై వ్యూహం...

## అక్టోబర్ నాటికి అన్ని ఎన్నికలు పూర్తి ఖాయం

దశల వారీగా జరిగే ఎన్నికల్లో గెలవాల్సిందే

అక్టోబర్ నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేద్దాం

రిజర్వేషన్లపై ఇబ్బందులొచ్చినా అధిగమిద్దాం

టీడీపీ ఎమ్మెల్యేలకు, లీడర్లకు శిక్షణ

టీడీపీ మంత్రుల బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ లో మంత్రి నారా లోకేశ్



(అమరావతి - జయజయహే)

కూటమి పార్టీలు స్థానిక ఎన్నికలు రెడీ అవుతున్నాయి. ఇప్పటికే జనసేన అధిష్ఠానం.. ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్యకర్తలతో వరుసగా భేటీ అవుతుంది. టీడీపీ కూడా ఎన్నికల కసరత్తును స్పీడప్ చేసింది. ఈ నెల 6, 7 తేదీల్లో టీడీపీ ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఏడు అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ..మిగతా 3లో



వివేకా హత్య కేసులో మళ్లీ

## రంగంలోకి ఈడీ

రూ. 40 కోట్ల డీల్ పై వరుసగా విచారణలు

దస్తగిరిని సుదీర్ఘంగా విచారించిన అధికారులు

బ్యాంక్ లావాదేవీలపై విచారణ

(హైదరాబాద్ - జయజయహే)

మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో దర్యాప్తును ఈడీ ముమ్మరం చేసింది. అప్రూవర్‌గా మారిన దస్తగిరిని విచారించింది. నేడు హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయానికి వెళ్లిన దస్తగిరిని అధికారులు 7 గంటలపాటు ప్రశ్నించారు. వివేకా హత్య కేసులో జరిగిన 40 కోట్ల రూపాయల డీల్‌పై అధికారులు విచారించారు. ఎర్ర గంగిరెడ్డి, శివశంకర్‌రెడ్డి, దస్తగిరి మధ్య జరిగిన ఒప్పందంపైనా ఆరా తీశారు. తనకు 5 కోట్ల రూపాయలు ఇస్తామని గతంలో సీబీఐకి దస్తగిరి వెల్లడించాడు. అప్పట్లో దస్తగిరి ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా ఈడీ అధికారులు దర్యాప్తు చేశారు. వివేకానందరెడ్డి హత్యకు ముందు, తర్వాత బ్యాంక్ లావాదేవీలపైనా ఈడీ దృష్టి సారించింది. దస్తగిరి కూడా బ్యాంక్ స్టేట్‌మెంట్లతో ఈడీ విచారణకు హాజరయ్యాడు. మరోవైపు వివేకా హత్య కోసం కీలక కుట్రదారులు వెచ్చించాలని నిర్ణయించుకున్న రూ.40 కోట్లు వారు ఎక్కడి నుంచి ..మిగతా 2లో



## ఆ ఐపీఎస్‌లపై సస్పెన్షన్ ఎత్తివేత

విశాల్ గున్ని, కాంతి రాణాలకు పోస్టింగ్

గడువు ముగియడంతో ప్రభుత్వ ఆదేశాలు

(అమరావతి - జయజయహే)

సీనియర్ ఐపీఎస్ అధికారుల సస్పెన్షన్ వ్యవహారంలో కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఐపీఎస్ అధికారులు కాంతి రాణా టాటా, విశాల్ గున్నిలపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ రాష్ట్ర సాధారణ పరిపాలనా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అఖిల భారత సర్వీసుల నిబంధనల ప్రకారం గతంలో విధించిన సస్పెన్షన్ గడువు సెప్టెంబర్ 4తో ముగియనున్న తరుణంలో, డీజీపీ అందించిన సమగ్ర నివేదికలు , ఐపీఎస్ అధికారి కాంతి రాణా టాటా సమర్పించిన వినతిపత్రాన్ని పరిశీలించిన అనంతరం ప్రభుత్వం ఈ ఆదేశాలు ఇచ్చింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ..మిగతా 3లో

## టీ.మంత్రి సురేఖ భర్తరఫ్

గవర్నర్ కు లేఖ రాసిన సీఎం

సీనియర్ నేత చెన్నారెడ్డిపైనా వేటు

ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్‌గా గద్వాల విజయ

అధిష్టానాన్ని రేవంత్ బ్లాక్ మెయిల్ చేసారు - సురేఖ

2



## ఆ మార్గదర్శకాలను సవరించాలి

సవరణల రూపకల్పన, పకడ్బందీ అమలు

ఇందు కోసం ప్రత్యేక కమిటీ నియామకం

రంగంలోకి 16 మంది సభ్యులతో కమిటీ

ప్రైవేటు స్కూల్స్ 25శాతం ఉచిత విద్యపై దృష్టి

2

## చవితి ఉత్సవాలకు ఆన్‌లైన్ అనుమతులు

ప్రత్యేక పోర్టల్ రూపకల్పన

దరఖాస్తు చేస్తే సింగిల్ విండో ద్వారా పర్మిషన్లు



2

# టీ.మంత్రి సురేఖ భర్తరఫ్

**గవర్నర్ కు లేఖ రాసిన సీఎం**

**సీనియర్ నేత చెన్నారెడ్డిపైనా వేటు**

**ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ గా గద్వాల విజయ**

**అధిష్టానాన్ని రేవంత్ బ్లాక్ మెయిల్ చేసారు - సురేఖ**

**(హైదరాబాద్ - జయజయహే)**



తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో సంచలన పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కొండ సురేఖపై వేటుకు లైన్ క్లియర్ అయింది. ఏఐసీసీ నుంచి గ్రీన్ సిగ్నల్ రావటంతో.... ఆమెను రాష్ట్ర మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగించాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డి లోక్ భవన్ (గవర్నర్ కార్యాలయం) కు లేఖ రాసినట్లు సమాచారం. ఈ లేఖ లోక్ భవన్ కార్యాలయానికి చేరటంతో... గవర్నర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అధికారికంగా బర్తరఫ్ చేస్తూ ఉత్తర్వులు రావాల్సి ఉంటుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు పలువురిని ఉద్దేశించి మంత్రి కొండా సురేఖ, ఆమె కుటుంబ సభ్యులు చేసిన తీవ్ర వ్యాఖ్యలు, వివాదాస్పద వ్యవహారాల నేపథ్యంలో ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించారన్న కారణంతో కాంగ్రెస్ అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో సీఎం రేవంత్ రెడ్డి ఈ చర్యకు ఉపక్రమించారు.

**చిన్నారెడ్డిపైనా వేటు..!**

ఈ బర్తరఫ్ వేటుతో పాటు ప్రభుత్వ పరిపాలనా యంత్రాంగంలోనూ రేవంత్ రెడ్డి సర్కార్ కీలక మార్పులు చేసింది. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా మండలి ఉపాధ్యక్షుడిగా సేవలు అందిస్తున్న డాక్టర్ జి. చిన్నారెడ్డి నియామకాన్ని ప్రభుత్వం తక్షణమే రద్దు చేసింది. ఆయనపై కూడా క్రమశిక్షణ కమిటీ నివేదికను పరిశీలించిన అధినాయకత్వం... వేటు వేసేందుకు మొగ్గు చూపింది. దీంతో ఆయన స్థానంలో జీహెచ్ఎంసీ మాజీ మేయర్ గద్వాల విజయలక్ష్మిని ప్రణాళికా మండలి నూతన ఉపాధ్యక్షురాలిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రోవైపు వరంగల్ ప్రాంతంలో అత్యంత కీలకమైన కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్‌పర్సన్‌గా మాజీ రాజ్యసభ సభ్యురాలు జి. సుధారాణిని ప్రభుత్వం నియమించింది. ఇక రాష్ట్ర మహిళా కమిషన్ నూతన ఛైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారదను నియమించారు. పార్టీ క్రమశిక్షణ విషయంలో రాజీ పడేది లేదని... ఎంతటి సీనియర్ నాయకులైనా చర్యలు తప్పవని ఈ నిర్ణయం ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పష్టమైన సంకేతాలు ఇచ్చిందనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి.

**కుట్ర చేశారు - సురేఖ**

నిజానికి తనను మంత్రివర్గం నుంచి తొలగించాలనే ఆలోచన కాంగ్రెస్ అధిష్టానానికి ఏమాత్రం లేదని, కేవలం రేవంత్ చేసిన బ్లాక్‌మెయిలింగ్ వల్లే ఈ నిర్ణయం వెలువడిందని సురేఖ స్పష్టం చేశారు. తన పదవి ఊడగొట్టడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని.... ముఖ్యంగా కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డిలు కలిసి ఈ కుట్రకు తెరతీశారని ఆరోపించారు. సొంత పార్టీలోనే ఉంటూ తనను బలిచేశారని ఆవేదన వ్యక్తం చేసిన కొండ సురేఖ, సీఎం రేవంత్ రెడ్డి మూలాలు తెలుగుదేశం పార్టీలో ఉండటమే ఇందుకు కారణమని విమర్శించారు. "సీఎం రేవంత్ రెడ్డి టీడీపీ నుంచి వచ్చారు కాబట్టే ఇలాంటి కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నారు. వేం నరేందర్‌రెడ్డి లాంటి వారిని వెనుకుండి నడిపిస్తూ మైండ్ గేమ్‌లు ఆడిస్తున్నారు. నాపై తీసుకున్న చర్యలు కేవలం కక్షపూరితమైనవే. ఒంట్లో టీడీపీ రక్తం ఉన్నవాళ్లే ఇలాంటి పనులు చేస్తారు," అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.



ప్రణాళికా మండలి ఉపాధ్యక్షుడిగా ఉన్న సీనియర్ నేత డాక్టర్ జి. చిన్నారెడ్డిపై చర్యలు తీసుకోవడాన్ని కూడా సురేఖ తప్పుపట్టారు. చిన్నారెడ్డికి దీనితో ఎలాంటి సంబంధం లేదని, కేవలం తనను టార్గెట్ చేసే క్రమంలో ఆయనను బలి చేయడం ఎంతమాత్రం సరికాదని అన్నారు. ప్రభుత్వంలో ఎంతోమంది నేతలు విమర్శలు, కామెంట్స్ చేస్తున్నారని.... మరి వారిని లేదా వారి కుటుంబాలను ఎందుకు బాధ్యులను చేయడం లేదని ప్రశ్నించారు. "కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పలు వ్యాఖ్యలు చేసినా ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.. ఎందుకు? నా కుమార్తె సుస్మితను మాత్రం ఎందుకు అడ్డుకుంటున్నారు?" అని రేవంత్ సర్కార్‌ను నిలదీశారు. తమ కుమార్తె సుస్మిత వ్యాఖ్యల వివాదంపై స్పందిస్తూ.. "మహిళలు ఇండిపెండెంట్‌గా ఉండాలని, సొంతంగా ఎదగాలని రాహుల్ గాంధీ నిత్యం చెప్తారు. మరి మా బిడ్డ మాట్లాడితే నన్ను ఎందుకు బాధ్యులను చేస్తున్నారు...? నా కూతురు ఒక ఇండిపెండెంట్. ఆమెకు ఒక కుటుంబం ఉంది. రాజకీయాల్లోకి రావాలనే కోరిక ఆమెకు ఉంది. తన తండ్రికి కనీసం ఒక్క కార్పొరేషన్ ఛైర్మన్ పదవి కూడా ఇవ్వలేదనే బాధ ఆమె మనసులో ఉంది. అలాంటప్పుడు నా కూతురు మాట్లాడిన దానికి నన్ను బాధ్యురాలిని చేయడం ఏంటి? నా కూతురి వ్యక్తిగత అభిప్రాయాలను అడ్డుకునే హక్కు మాకు లేదు" అని తేల్చి చెప్పారు. తనను కనీసం వివరణ కూడా అడగకుండానే దారుణంగా బర్తరఫ్ చేశారని సురేఖ ఆవేదన చెందారు. కాంగ్రెస్ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖార్గేకు ఇప్పటికే సమగ్రమైన లేఖ ఇచ్చానని.... అయినా తనను బలి చేయడం తీరని బాధ కలిగించిందన్నారు. అధిష్టానానికి రాసిన లేఖను కూడా మీడియాకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి తానంతట తానుగా రాజీనామా చేయలేదని, తనను ఎవరూ రాజీనామా చేయమని కూడా అడగలేదని, నేరుగా రేవంత్ రెడ్డే తనపై వేటు వేశారని స్పష్టం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు రేవంత్ రెడ్డి పాలనతో సంతోషంగా ఉన్నారా? మీరు సంతోషంగా లేరని నాకు తెలుసు, మీకు తెలుసు. ఈరోజు నాకు జరిగింది, రేపు మీకూ జరుగుతుంది. ఇప్పటికైనా బయటికి వచ్చి మాట్లాడండి. మనం ఇస్తామన్న హామీలు ఇవ్వలేదు.. దీంతో ప్రభుత్వంపై వ్యతిరేకత ఏర్పడింది. కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకతపై సర్వే చేయించాలని సూచిస్తున్నాను" అని సురేఖ మీడియాతో చెప్పారు.

## ఆ మార్గదర్శకాలను సవరించాలి

**(అమరావతి - జయజయహే)**

ప్రైవేటు పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. విద్యా హక్కు చట్టం (ఆర్టీఈ) 2009 సెక్షన్ 12(1)(సీ) ప్రకారం.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు అన్-ఎయిడెడ్ పాఠశాలల్లో పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించేందుకు అమలవుతున్న ప్రస్తుత మార్గదర్శకాలను సవరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సవరణల రూపకల్పన, పకడ్బందీ అమలు కోసం ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది జనవరి 13వ తేదీన దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన కీలక తీర్పుతో పాటు జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్రంలో ఈ ఉచిత ప్రవేశాల ప్రక్రియను మరింత పారదర్శకంగా మార్చాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఉచిత సీట్ల కేటాయింపులో ఎలాంటి అక్రమాలు జరగకుండా, అసలైన అర్హులైన నిరుపేద విద్యార్థులకే ఈ ప్రయోజనం అందేలా పాత నిబంధనలను సవరించి కొత్త మార్గదర్శకాలను రూపొందించనున్నారు.

**16 మంది సభ్యులతో ప్రత్యేక కమిటీ**

నూతన మార్గదర్శకాల సవరణ బాధ్యతలను వేగవంతం చేసేందుకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఛైర్‌పర్సన్‌గా మొత్తం 16 మంది సభ్యులతో కూడిన రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ కమిటీకి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ సమీమ్ అన్సారియా ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. ఈ రాష్ట్ర స్థాయి కమిటీ విద్యా హక్కు చట్టం అమలు తీరును, ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాల విధానాన్ని లోతుగా అధ్యయనం చేస్తుంది. అర్హతల నిబంధనలు, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ, సీట్ల కేటాయింపు మరియు పాఠశాలల యాజమాన్యాలకు చెల్లించే ఫీజుల పునరుద్ధరణ వంటి అంశాలపై స్పష్టమైన నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి సమర్పిస్తుంది. కమిటీ సమర్పించే నివేదిక ఆధారంగా రాష్ట్రంలో కొత్త ఉచిత ప్రవేశాల గైడ్‌లైన్స్‌ను త్వరలోనే అమలు చేయనున్నారు.

### వివేకా హత్య కేసులో మళ్లీ

# రంగంలోకి ఈడీ

**మొదటి పేజీ తరువాయి...**

సమకూర్చుకోవాలనుకున్నారు? అంత భారీ మొత్తం వారికి ఇచ్చేందుకు తెర వెనుక సిద్ధమైన వ్యక్తులెవరు? హత్యలో ప్రత్యక్షంగా పాల్గొన్న నలుగురు నిందితులకు అడ్వాన్స్‌గా చెల్లించిన రూ.4 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయనే కోణాల్లో ఈడీ దర్యాప్తు ముమ్మరం చేసింది. కేసులో కీలక కుట్రదారులు, నిందితులు, అనుమానితులు, తెరవెనక సూత్రధారులు వివేకా హత్యకు కొన్ని నెలల ముందు, తర్వాత నిర్వహించిన ఆర్థిక లావాదేవీలను నిశితంగా పరిశీలిస్తోంది. ఈ డబ్బు ఎవరి నుంచి ఎవరికి, ఏయే మార్గాల్లో రూటింగ్ అయ్యింది, దీనికి మూలం ఎక్కడుందనే కోణంలో వివరాలు సేకరిస్తోంది. ఈ క్రమంలోనే నిందితులైన అవినాష్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకరరెడ్డి, సునీల్‌యాదవ్, ఎర్ర గంగిరెడ్డి, దస్తగిరిల నివాసాల్లో సోదాలు చేసి ఇప్పటికే కొన్ని పత్రాలు స్వాధీనం చేసుకుంది. వైఎస్ వివేకానందరెడ్డి 2019 మార్చి 15 అర్ధరాత్రి తర్వాత పులివెందులలోని ఆయన నివాసంలో దారుణ హత్యకు గురయ్యారు. ఈ హత్యకు ఫిబ్రవరి 10న ఎర్ర గంగిరెడ్డి నివాసంలోనే కుట్ర రూపొందించినట్లు సీబీఐ దర్యాప్తులో తేల్చింది. 'వివేకానందరెడ్డిని చంపేయ్ ఈ హత్య చేస్తే నీ జీవితం సెటిలైపోతుంది. నువ్వు ఒక్కడివే కాదు. మేమూ నీతో వస్తాం' అని ఎర్రగంగిరెడ్డి తనతో చెప్పారని కేసులో అప్రూవర్‌గా మారిన షేక్ దస్తగిరి ఇప్పటికే సీబీఐకి వాంగ్మూలం ఇచ్చాడు. హత్య వెనక వైఎస్ భాస్కరరెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకరరెడ్డి వంటి పెద్ద రాజకీయ నాయకులున్నారని, హత్య చేస్తే శివశంకరరెడ్డి రూ.40 కోట్లు ఇస్తారని, అందులో రూ.5 కోట్లు నీకు ఇస్తానని కూడా ఎర్ర గంగిరెడ్డి తనతో చెప్పారని దస్తగిరి వాంగ్మూలంలో చెప్పాడు. వివేకానందరెడ్డిని చంపాలని ఎర్ర గంగిరెడ్డి చెప్పిన రెండు, మూడు రోజుల తర్వాత సునీల్ యాదవ్ కోటి నగదు తీసుకెళ్లి దస్తగిరికి అడ్వాన్స్‌గా ఇచ్చాడని సీబీఐ అభియోగపత్రంలో పేర్కొంది.




## పొగాకు, పౌల్ట్రీ రైతులకు ఊతం

**మొదటి పేజీ తరువాయి...**

వ్యయం చేయడానికి అనుమతి మంజూరు చేసింది. మంగళగిరి అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి కోర్టు సజావుగా పనిచేసేందుకు అవసరమైన సిబ్బంది, రికరింగ్, నాన్ రికరింగ్ బడ్జెట్ అంశాలను పరిగణనలోకి తీసుకుని, మొత్తం 21 రెగ్యులర్ పోస్టులను మంజూరుకు క్యాబినేట్ ఆమోదం తెలిపింది. రాజమహేంద్రవరంలోని ఈఎస్ ఐ ఆసుపత్రిని 50 పడకల నుంచి 100 పడకలకు అప్‌గ్రేడ్ చేసేందుకు, అవసరమైన వైద్య, పారా మెడికల్ సిబ్బంది కేడర్ ను మంజూరు చేసేందుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. అమరావతి రాజధాని నగరంలో కొత్త భూ కేటాయింపులకు సంబంధించి మంత్రుల బృందం చేసిన సిఫార్సులను, సీఆర్డీఏ అథారిటీ తీర్మానం ఆమోదించే ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. శాకమూరు వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్ లైబ్రరీ, ఆడిటోరియం, గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్‌లతో "అమరావతి సంఘమం" నిర్మాణానికి రూ.759.793 కోట్ల అంచనా వ్యయానికి క్యాబినేట్ ఆమోదం తెలిపింది. అమరావతి మీదుగా ఎర్రుపాలెం--నంబూరు నూతన బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ నిర్మాణానికి 100 మీటర్ల బఫర్‌తో పాటు, క్యాపిటల్ సిటీ సరిహద్దు నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు వరకు గ్రిడ్ రోడ్ల విస్తరణతో ఇన్నర్ రింగ్ రోడ్ ఏర్పాటుకు, రైతుల అభ్యర్థన మేరకు ల్యాండ్ పూలింగ్ స్కీమ్ చేపట్టేందుకు సీఆర్డీఏ కమిషనర్‌కు అధికారం కల్పించేందుకు క్యాబినేట్ ఆమోదం తెలిపింది. గుంటూరు జిల్లా కంతేరు గ్రామంలో 974 ఎకరాలు, తాడికొండ మండలం పరిధిలో 5,238.50 ఎకరాలు మొత్తం 6,212.50 ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్ చేసేందుకు క్యాబినేట్ ఆమోదం తెలిపింది. ఏపీ "పౌల్ట్రీ అభివృద్ధి విధానం 2025-2029" ముసాయిదాకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. పౌల్ట్రీ రంగాన్ని మరింత బలోపేతం చేసి, రైతుల ఉత్పత్తి వ్యయాలను తగ్గించడం, వ్యాధుల పర్యవేక్షణ నివారణ, బయోసెక్యూరిటీని మెరుగుపరచడం, గ్రామీణ/బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీని అభివృద్ధి చేయడం, పౌల్ట్రీ ఉత్పత్తుల ప్రాసెసింగ్ విలువ ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించడం, మార్కెట్, ఎగుమతి అవకాశాలను విస్తరించడం లక్ష్యంగా ఈ పాలసీకి క్యాబినేట్ ఆమోదం తెలిపింది.



# కిలో ఉల్లి రూ. 35కే

**మార్కెట్ కంటే రూ.10 తక్కువకే అమ్మాలి**

**ధరల పెరుగుదలపై ఉపసంఘం**

**నియంత్రణపై కేబినెట్ కమిటీ అధ్యయనం**

**(అమరావతి - జయజయహే)**

గల్ఫ్ యుద్ధం, ఎల్‌నినో ప్రభావాన్ని సాకుగా చూపుతూ కొందరు దళారీలు, స్వార్థపరులు నిత్యావసర వస్తువుల ధరలను ఇష్టారాజ్యంగా పెంచుతున్నారన్న అభిప్రాయం ప్రభుత్వానికి వ్యక్తమైంది. ధరల పెరుగుదల వెనుక కారణాలను గుర్తించి, ప్రభుత్వ జోక్యంతో సామాన్యుడిపై భారం తగ్గించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో ఆర్థిక మంత్రి పర్యావ కేశవ్, వ్యవసాయ శాఖ మంత్రి నాయుడు లతో ఏర్పాటైన క్యాబినెట్ సబ్ కమిటీ నిత్యవసర ధరల నియంత్రణపై దృష్టి సారించింది. నిత్యావసరాల్లో కీలకమైన ఉల్లి ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. కేంద్ర సంస్థలతో సమన్వయం చేసుకుని నాణ్యమైన ఉల్లిపాయలను తక్కువ ధరకే అందించనున్నారు. ప్రత్యేక కౌంటర్ల ద్వారా కిలో ఉల్లిని రూ.35కే విక్రయించేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. పామాయిల్ ధరలను కూడా తగ్గించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ప్రస్తుత మార్కెట్ ధర కంటే కనీసం రూ.10 తక్కువకు పామాయిల్ అందించేలా సంబంధిత కంపెనీలతో చర్చించి రెండు రోజుల్లో చర్యలు తీసుకోనున్నారు.

**మార్కెట్ కంటే రూ.10--12 తక్కువ**

ఇప్పటికే ఏర్పాటు చేసిన రైస్ కౌంటర్ల ద్వారా మార్కెట్ ధర కంటే రూ.10 నుంచి రూ.12 తక్కువకే బియ్యం అందిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కౌంటర్ల సంఖ్యను పెంచి తక్కువ ధరకే బియ్యం అందించేలా చర్యలు కొనసాగనున్నాయి. కందిపప్పు ధరల నియంత్రణపైనా కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలని మంత్రుల బృందం నిర్ణయించింది. రానున్న రోజుల్లో ధరల పెరుగుదలకు అవకాశం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని నిర్ణయం. నిత్యావసర ధరల నియంత్రణపై ముఖ్యమంత్రి చంద్రబాబు మరోసారి సమీక్షించనున్నారు. ధరల పెరుగుదలను అడ్డుకునేందుకు ప్రభుత్వ జోక్యాన్ని మరింత పటిష్టం చేయాలని నిర్ణయించారనీ పౌరసరఫరాస్ శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ టీవీ9 కి తెలిపారు

# చవితి ఉత్సవాలకు ఆన్‌లైన్ అనుమతులు

**ప్రత్యేక పోర్టల్ రూపకల్పన**

**దరఖాస్తు చేస్తే సింగిల్ విండో ద్వారా పర్మిషన్లు**

**(అమరావతి - జయజయహే)**

వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు పోలీసు శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఉత్సవ మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు ఇకపై అధికారుల చుట్టూ, వివిధ ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్‌లోనే సులువుగా అనుమతులు పొందేలా ఒక ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ విషయాన్ని రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా వెల్లడించారు. మండపాల ఏర్పాటుకు 'ఘఘ.స్తుఋఅవంస్త్రబ్యిఖజ.అవ్' అనే సింగిల్ విండో ఈ-పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పోలీసులు స్పష్టం చేశారు. ఇప్పటివరకు వివిధ ప్రభుత్వ శాఖల నుంచి విడివిడిగా అనుమతులు తీసుకోవాల్సి వచ్చేది. కానీ, ఈ కొత్త విధానంతో ఒక్క దరఖాస్తుతోనే అన్ని శాఖల ఆమోదం లభిస్తుంది.

**క్యూఆర్ కోడ్ పర్మిషన్..**

ముఖ్యంగా పోలీస్, అగ్నిమాపక, మున్సిపల్, విద్యుత్ మరియు రెవెన్యూ శాఖల సమన్వయంతో ఈ అనుమతుల ప్రక్రియను నిర్వహించనున్నారు. దరఖాస్తును పరిశీలించిన అనంతరం అధికారుల ఆమోదంతో క్యూఆర్ కోడ్‌తో కూడిన డిజిటల్ అనుమతి పత్రాన్ని నిర్వాహకులు ఆన్‌లైన్ నుంచే నేరుగా డౌన్లోడ్ చేసుకోవచ్చు. ఈ ఆన్‌లైన్ సేవను ప్రభుత్వం పూర్తిగా ఉచితంగా అందిస్తోంది. దరఖాస్తు కోసం నిర్వాహకులు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. రాష్ట్రవ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు సురక్షితమైన, ప్రశాంతమైన మరియు క్రమబద్ధమైన వాతావరణంలో జరిగేలా చూడటానికే ఈ ఏకీకృత అనుమతి వ్యవస్థను తీసుకొచ్చినట్లు పోలీస్ శాఖ తెలిపింది. నిర్వాహకులందరూ ఈ ఆన్‌లైన్ వెబ్‌సైట్ సదుపాయాన్ని ఉపయోగించుకుని, ముందస్తుగానే దరఖాస్తులు పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. "సురక్షితమైన వేడుకలు -- బాధ్యతాయుతమైన వేడుకలు" నిర్వహించడంలో భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ పిలుపునిచ్చింది.

# ప్రొటోకాల్ ఉల్లంఘన సహించం

జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వెలిగొండ ప్రారంభానికి జలవనరుల శాఖ, ఆర్థిక శాఖ సమన్వయంతో పని చేశాయన్నారు. రామానాయుడు సింప్లిసిటీ మెయింటైన్ చేస్తూ పని బాగా చేశారంటూ అభినందించారు. దుగరాజపట్నం వద్ద షిప్ బిల్డింగ్ యూనిట్ ఏర్పాటు కానుందని.. ఆంధ్ర పాప్ కార్న్, అరకు కాఫీ ప్రతి గ్రామానికి విస్తృతంగా వెళ్లాలని సూచించారు. ఏపీలో ఎల్‌నినో పరిస్థితులను వివరిస్తూ ఈరోజే కేంద్రానికి లేఖ రాయనున్నట్లు సీఎం తెలిపారు. ప్రతినెలా క్షేత్రస్థాయి పరిస్థితులు కేంద్రానికి నివేదిద్దామన్నారు. అత్యధికంగా అన్నమయ్య జిల్లాలో 76 శాతం, ప్రకాశంలో 70 శాతం మేర లోటు వర్షపాతం ఉ ంద‌న్నారు. గత 30ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా అతి తక్కువ వర్షపాతం ఈసారి నమోదైందని చెప్పారు. తాగునీరు అందించటం, పశుగ్రాసానికి లోటు లేకుండా చూడటం, సీడ్ బాల్స్ విషయంలో మంత్రులంతా కార్యోన్ముఖులై పని చేయాలని సూచించారు. తాగునీటికి ఎంతైనా ఖర్చు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అవకాశం ఉన్న చోట నీటి స్టోరేజ్‌కు చర్యలు చేపట్టాలని తెలిపారు. గ్రౌండ్ వాటర్‌ను అంచనా వేస్తూ అవసరం అనుకుంటే అదనంగా బోరు వేసేందుకు అనుమతినిద్దామని ముఖ్యమంత్రి అన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఒక్క ఎకరా కూడా ఎండటానికి వీల్లేదన్నారు. తాగు నీటిని రవాణా చేసేందుకు అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల్లో జీఎస్‌డీపీ తగ్గకుండా చర్యలు తీసుకోవాలని.. ప్రతి మంత్రివర్గంలో ఎల్‌నినో ప్రభావంపై సమీక్షిద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.



### బూత్ ఇన్‌చార్జీలతో
# యూనిట్ సమావేశం

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 03, జయ జయహే**

శ్రీకాళహస్తి: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు, శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాలతో యూనిట్ ఇన్‌చార్జ్ ఎన్. వినయ్ కుమార్ ఆధ్వర్యంలో బూత్ ఇన్‌చార్జీలతో యూనిట్ సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ నెలలో మొదటి బుధవారం నిర్వహించాల్సిన కార్యక్రమంలో భాగంగా జరిగిన ఈ సమావేశంలో యూనిట్ పరిధిలోని బూత్‌ల వారీగా పార్టీ కార్యక్రమాల నిర్వహణ, ప్రజలకు అందుబాటులో ఉండేలా కార్యకర్తలు చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్ నాగమల్లి దుర్గాప్రసాద్, యూనిట్ కో-కన్వీనర్ వజ్రం కిషోర్, బూత్ ఇన్‌చార్జీలు సాజిద్ అహ్మద్, బాలాజీ, హరి, చంద్ర, హర్షద్, రషీద్ అహ్మద్, బూత్ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

# యువకుడు అదృశ్యం

**చోడవరం,సెప్టెంబర్ 3,జయ జయ హే**



చోడవరం మండలం గాంధీ గ్రామం, విద్యానగర్ కాలనీకి చెందిన పైల లక్ష్మి, , తన కుమారుడు పైల నిహార్ నాయుడు,(19 ) అదృశ్యమైనట్లు చోడవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారు తెలిపిన వివరాల ప్రకారం, ఆమె కుమారుడు నిహార్ నాయుడు ఇంటర్మీడియట్ పూర్తి చేసి నీట్ పరీక్ష రాశాడు. పరీక్షలో వచ్చిన మార్కుల విషయమై అతని తండ్రి తరచుగా మందలించేవాడని తెలిపారు. అయితే ఈ నెల 2 న మధ్యాహ్నం సుమారు 12:45 గంటలకు నిహార్ నాయుడు ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అతని కోసం పరిసర గ్రామాలు తెలిసిన ప్రాంతాల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో పైల లక్ష్మి గురువారం మధ్యాహ్నం చోడవరం పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయగా, పోలీసులు అదృశ్యం కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యువకుడి ఆచూకీ కోసం అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. ఆచూకీ తెలిసిన వారు చోడవరం పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరుతున్నారు.

# వందే జగద్గురుం..!!

## శ్రావణ బహుళాష్టమి ప్రత్యేక శీర్షిక.. కృష్ణాష్టమి శుభాకాంక్షలతో...

భారతీయ సంస్కృతిలో గురువు స్థానం అనేది దేవుడు కంటే గొప్ప స్థానం. అలాంటి గురువుల్లో జగత్ మొత్తానికి గురువు శ్రీకృష్ణుడు. అందుకే కృష్ణం వందే జగద్గురుం .

కృష్ణాయ వాసుదేవాయ హరమే పరమాత్మనే
ప్రణత నాశయ గోవిందాయ నమో నమః

వసుదేవ తనయుడైన కృష్ణుడికి వందనం నిన్ను తలుచుకున్న వెంటనే కష్టాలను నాశనం చేసే పరమాత్మవు నీవు. నీవు జగత్తును ఉద్ధరించడానికి జన్మించావు.

కృష్ణ లీలలు అన్నీ అంతరార్థంతో జరిగాయి ప్రతి లీల వెనుక ఒక దివ్యమైన రహస్యం ఉంది. ధర్మాచరణ ఎలా చేయాలి? ఎలా నడుచుకోవాలి ఎలా మనిషి ఎదగాలి అనే విషయాలను ప్రబోధించిన మార్గ దిశ నిర్దేశి కృష్ణ భగవానుడు.

కృష్ణ లీలా తత్వం- అంతరార్థము:-



**వెన్నదొంగ లీల**

మృదువైన తెల్లనైనా స్వచ్ఛమైన మనసు లాంటిది వెన్న. కృష్ణుడు అందరి గృహాలలో దాచుకున్న వెన్నను దొంగలించి తింటాడు అంటే మన స్వచ్ఛమైన మనసును కృష్ణుడు తనలోకి స్వీకరిస్తాడు. మన మనసును తన మనస్సుగా భావిస్తాడని అంతరార్థం.

**కాళీయ మర్దన లీల**

యమునా నది తీరంలో ఖాళీయమనే విష సర్పం మీద నాట్యం చేసి దానిని హతమార్చాడు కృష్ణ భగవానుడు. ఏమి నాన్నది మన శరీరం కాళీయం. అనగా మనలో పగ ద్వేషం కోపం అహం అసూయ స్వార్థం అనే పదార్థాలు. మనలో ఉ ఒడే వాటిని అణచివేయకపోతే మన జీవితం విషమయం అవుతుంది. అందుకని కృష్ణుడు మనలో ఉండే అంతరాలోచనల మీద నాట్యం చేసి మనలో ఉన్న చెడు గుణాలనన్నింటిని హతమార్చాడు.

**గోవర్ధన పర్వత లీల**

చిన్ని కృష్ణుడు తన యొక్క చిన్ని చిటికెన వ్రేలు తో పెద్ద కొండను పైకి ఎత్తి పట్టుకోని ఊరు అంతటినీ వర్షం నుండి కాపాడాడు. పెద్ద కొండ అంటే పెద్ద కష్టం చిటికెన వేలు అంటే చిన్న నమ్మకం. మనకు దేవుడి మీద చిన్న నమ్మకం ఉ ఒటే పెద్ద కష్టాన్ని తొలగిస్తాడు అనే భావన కోసం జరిగిన లీల. మన పెద్ద కష్టాన్ని ఎత్తి పట్టుకుని కృష్ణుడు మన అందరిని కష్టాల నుండి విముక్తులను చేస్తాడు.

**రాసలీల**

వేల వేల మంది తో కృష్ణుడు నాట్యం చేశాడు గోపికల సమూహంలో నాట్యం చేస్తూ గోపికలందరినీ ఆనందభరితులను చేశాడు. అనగా కృష్ణుడు మన అందరి హృదయంలో కొలువుదీరి ఉంటాడు. ఎవరైతే కృష్ణడితో మాట్లాడతారో ఎవరైతే కృష్ణుడిని పరవభక్తితో కొలుస్తారు కృష్ణుడు తప్పక మనందరితో కలిసి అడుగులు వేస్తూ ఉంటాడు అని దీని యొక్క అంతరార్థం. ఇది పరమ యోగ భక్తికి నిదర్శనం.

**గీతా బోధ లీల**

యుద్ధం మధ్యలో అర్జునుడికి కృష్ణుడు గీతాబోధ చేశాడు. జీవితం యుద్ధం లాంటిది. ధర్మానికి అధర్మానికి మధ్యలో జరిగేదే యుద్ధం. మన మనసులో రోజు యుద్ధం రకరకలైన ఆలోచనలతో చేస్తూ ఉంటాము. ఈ సమయంలో మనం భయపడకుండా అడుగులు వేస్తే యుద్ధంలో గెలిచిన వారము అవుతాము. భీతి అనేది మరణానికి ఆహ్వాన పత్రిక లాంటిది. కంటి నీరు మన యొక్క శక్తిని బుద్ధిహీనులు గా చేస్తుంది. ఏ సందర్భంలో అయినా ఎప్పుడూ కంటి నుండి నీరు రాకుండా తెలివిగా నీతిగా ఆలోచనలు చేసి దేన్నైనా నవ్వుతూ స్వీకరించాలి. విజయం పొందిన, అపజయం పాలైన రెండింటిని సమాన దృష్టితో చూడగలిగితేనే నిజమైన విజయాన్ని జీవితకాలం మనం సాధిస్తాము. కార్యం చేయడం మన వంతు ఫలితాన్ని భగవంతుడికి విడిచిపెట్టాలి. ఇదే గీత సారాంశము.

**కృష్ణ తత్వం జీవన -సన్మార్గ -వారధి**

ధర్మాచరణ తో కూడిన ఆలోచనలు చేస్తూ ధర్మపరంగా నడుచుకోవడమే కృష్ణ తత్వము. మంచి కోసం ఏ పని అయినా చేయవచ్చు. భీతి ఉండకూడదు. ఎల్లవేళలా నీతిపరమైన ఆలోచనలు చేయాలి. అవరోధాలు ఎదురర్కొన్నప్పటికి నిర్ణయాలు సన్మార్గానికి పునాది రాళ్లు గా మలచుకోవాలి. ఎల్లప్పుడూ నవ్వుతూ ఉండాలి ప్రేమ అనే గుణాన్ని నింపుకొని స్వార్థం అనే ఆలోచన చేయకూడదు జీవితంలో కష్టాలు వస్తే అవి ఎంతో పెద్దదిగా మనం భావిస్తాం, కానీ కృష్ణుడు వాటిని అతి సూక్ష్మంగా నవ్వుతూ తీసుకుంటూ ఆటలో గెలిచినట్లుగా జీవితాన్ని గెలుస్తామని చెప్పేదే కృష్ణ తత్వం. కృష్ణుడు 16 కళలతో పరిపూర్ణుడు. మనం కూడా కృష్ణ తత్వాన్ని అనుకరిస్తూ ఆచరిస్తూ ఒకే జీవితంలో వివిధ రకాలైన అనగా బంధాలలో సందర్భానుసారంగా ప్రతి పాత్రలోనూ ధర్మంగా నడుచుకోవాలి. యోగ తత్వం ప్రేమతత్వం లోతుగా ఉన్న కృష్ణ మార్గాన్ని మనం అనుకరిస్తే ఎటువంటి కష్టాలు లోటుపాట్లు లేని జీవనాన్ని పరిపూర్ణమైన మనం పొందుతాము పొందగలుగుతాము.




**రచన**
**ఏ. బాల సౌజన్య కుమారి**
**నంది అవార్డు గ్రహీత,తెలుగు ఆచార్యులు,**
**ఆధ్యాత్మిక వేత్త,ప్రవచన కర్త**

# అష్టలక్ష్ములను కొలిస్తే అష్ట సంపదలు లభిస్తాయి

## శ్రావణ శుక్రవార ప్రత్యేక శీర్షిక....

శ్రావణమాసం అనగానే మొదటగా అందరికీ గుర్తు వచ్చేది లక్ష్మీ పూజ. ఈ మాసంలో అసలు పూజలు ఎందుకు చేయాలి అంటే మన అందరి జీవితం లో సంపదలు కురవాలి అనే ఆలోచన. సంపద అనగా ధనము మాత్రమే కాదు.

**మనకు లభించేవి అన్నీ సంపదలే.**

మన జీవనానికి కావలసిన ధర్మాచరణ చేస్తే నే మానవులు మంచి జీవితాన్ని పొందుతారు. రుణ బాధలు తొలగిపోవాలి అంటే మన నిత్యం పూజలు తో పాటుగా ధర్మాన్ని అనుసరించాలి. ధర్మాన్ని పరిరక్షించాలి. ధర్మంతో ఎవరైతే అడుగులు వేస్తారో వారికి సన్మార్గ లక్షణాలు ఏర్పడి మోక్షం ప్రాప్తిస్తుంది. సంపదలు నిలవాలి అంటే మంచి ఆలోచనలు చేయాలి. అష్ట సంపదలు ఉండాలి అంటే మనము అష్ట మార్గములలో లో ధర్మాచరణ చేయడం ద్వారా ఐశ్వర్యవంతులము అవుతాము. లక్ష్మీదేవికి శ్రావణమాసంలో ఏ పూజ చేసిన ఏ నోము నోచిన నోరు రెట్లు అధిక ఫలితం లభిస్తుంది.




**అష్ట లక్ష్మీ ఆరాధనే - అష్ట ఐశ్వర్య సంపద సంపద**

1. మూలమైన ఆధారమైన -ఆదిలక్ష్మి ఆరాధన

చతుర హస్తాలతో శంఖ చక్రాలతో విష్ణుమూర్తిలా మనకు దర్శనమిస్తుంది. అష్టలక్ష్ములలో ప్రధానంగా ప్రధమంగా మనకు ఆదిలక్ష్మి తల్లి వంటిది. ఆది అంటే అర్థము ప్రధమము మరియు మొదటిది. ఈ విధంగా మనమందరం ఆదిలక్ష్మి పూజిస్తే ప్రధానంగా మనస్సుకు ధైర్యాన్ని శక్తిని మొదటి అడుగులో మనకు అందిస్తుంది. మోక్షం లభించే మొదటి మార్గమే ఆదిలక్ష్మి ఆరాధన.

2. ద్వితీయం ధనలక్ష్మియే నమః

మానవ జీవనంలో జీవన అవసరము లకు ధనమే ప్రధానం. కానీ మనము నీతి పరమైన ఆలోచనలు చేస్తే ఎల్లవేళలా నిజాలు మాట్లాడితేనే ధనం నిలుస్తుంది. ధనలక్ష్మి రూపము మనకు ప్రధానంగా బంగారు నాణములతో దర్శనమిస్తుంది

3. దేశానికి వెన్నెముక రైతు - ధాన్య లక్ష్మీ కటాక్షం

దేశానికి ఆహారాన్ని పండించే రైతుకి ఆదిదేవత ధాన్యలక్ష్మి. జీవనంలో అన్నింటితో పాటు మన గృహంలో ఆహారము లోటు లేకుండా ఉండాలి అంటే ధాన్యలక్ష్మి పూజించాలి.

4. అదృష్టానికి హేతువు - గజలక్ష్మి

మానవులకు ఎన్ని ఉన్న అదృష్టం ఉంటేనే రాజయోగం ఉన్నత పదవి గౌరవం లభిస్తుంది. ప్రాచీన కాలంలో రాజులు గజలక్ష్మిని ఎక్కువగా పూజ చేయడం వలన రాజలోకం లభించింది అని నానుడి.

5. గృహంలో ఐశ్వర్యం అంటే శిశువులే సంతాన లక్ష్మి

మన భవిష్యత్తుకు పునాది మన పిల్లలు ఆరోగ్యమైన పిల్లల్ని పొందాలి అంటే సంతాన లక్ష్మి ని పూజించాలి.

6. ఎదుగుదలకు అవసరం ధైర్యం -ధైర్యలక్ష్మి

కష్టాలు వచ్చినప్పుడు కృంగిపోకుండా ప్రశ్నించుకోకుండా ధీరత్వంతో పోరాటం చేసే శక్తిని ఇచ్చేదే ధైర్యలక్ష్మి. ఈమెను నిరంతరం సేవిస్తేనే విశిష్టమైన పదవులు పొందుతాము.

7. విజయానికి హేతువు - విజయలక్ష్మి

విజయాన్ని మనకు అందించే లక్ష్మి, విజయపథంలో నడిపించే లక్ష్మి,మనకి కావలసినంత శక్తిని ఇచ్చే లక్ష్మి,పరీక్షలలో ఉత్తీర్ణత సాధించాలి అంటే విజయం కైవసం చేసుకోవాలి అంటే విద్యార్థులు కచ్చితంగా విజయలక్ష్మిని నిరంతరం ప్రార్థించాలి.

8. జ్ఞాన ప్రధాత -విద్యాలక్ష్మి

చదువుతోనే మానవ జీవితం పరిపూర్ణ పరిపూర్ణమయం అవుతుంది. చదువుతో మాత్రమే విశిష్టమైన జ్ఞానాన్ని పొందగలుగుతాము. జ్ఞానం ఉన్నప్పుడు మాత్రమే మానవ జీవితానికి సార్థకత లభిస్తుంది. అక్షర జ్ఞానమే గెలుపుకి ఆయుధము. విద్యాలక్ష్మి ని ఎంతరాయంగా విద్యార్థులు ఎల్లవేళలా పూజించాలి.

ఈ విధంగా మన జీవనంలో అష్టలక్ష్ములను పూజి స్తే అష్ట సంపదలను అపారంగా పొందుతాము. అమ్మవారి కరుణ మన పైన ఎల్లవేళలా ఉంటుంది.

**రచన**
**ఏ బాల సౌజన్యకుమారి**
**నంది అవార్డు గ్రహీత**
**తెలుగు ఆచార్యులు ప్రవచనకర్త, ఆధ్యాత్మికవేత్త**




# ఉషోదయ కాన్సెప్ట్ స్కూల్‌లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**చోడవరం,సెప్టెంబర్ 2, జయ జయహే**

ఉషోదయ విద్యా సంస్థలలో భాగమైన ఉషోదయ కాన్సెప్ట్ స్కూల్‌లో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ముందస్తుగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. చిన్నారులకు శ్రీకృష్ణ జన్మాష్టమి విశిష్టతతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఆధ్యాత్మిక విలువలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ కార్యక్రమాన్ని ఉషోదయ విద్యా సంస్థల చైర్మన్ జె. రమణాజీ శ్రీకృష్ణుని చిత్రపటానికి పూలమాల వేసి, పూజా కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా ప్రారంభించారు. ఉషోదయ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపాల్ పి. శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉషోదయ విద్యా సంస్థల సీసీ మెంబర్స్, కాన్సెప్ట్ స్కూల్ అధ్యాపక బృందం, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిన్నారుల అందమైన వేషధారణలు, చిన్ని కృష్ణుడి లీలలను ప్రతిబింబించే ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. అలాగే చిన్నారులు చిన్ని కృష్ణుడి పాటలకు కోలాటం ఆడుతూ తమ ప్రతిభను ప్రదర్శించారు. విద్యార్థుల కోలాట ప్రదర్శనలకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు తోటి విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో మరో ప్రధాన ఆకర్షణగా ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. చిన్ని కృష్ణుల వేషధారణలో ఉన్న చిన్నారులు ఉట్టిని కొట్టగా, గోపికల వేషధారణలో ఉన్న చిన్నారులు ఉట్టి తాడును లాగుతూ సందడి చేశారు. ఈ కార్యక్రమం ప్రాంగణంలో ఉత్సాహాన్ని నింపింది. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని పాఠశాల ప్రాంగణాన్ని పచ్చని తోరణాలు, పూల అలంకరణలు సంప్రదాయ అలంకరణలతో అందంగా తీర్చిదిద్దారు. చిన్నారుల కృష్ణుడు, గోపికల వేషధారణలు, కోలాటం, ఉట్టి కొట్టే కార్యక్రమాలతో పాఠశాల ప్రాంగణం అంతా పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ, పండుగలు కేవలం వేడుకలకు మాత్రమే పరిమితం కాకుండా, వాటి వెనుక ఉన్న సంస్కృతి, సంప్రదాయాలు, విలువలను చిన్నారులకు పరిచయం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. చిన్నారుల్లో మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిన్నారుల ఉత్సాహభరితమైన పాల్గొనడం, వారి చక్కని వేషధారణలు, సాంస్కృతిక ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



## పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా హృదయాలయంలో సేవా కార్యక్రమం

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారి పుట్టినరోజు సందర్భంగా నిడదవోలు నియోజకవర్గ శాసనసభ్యులు, రాష్ట్ర మంత్రి శ్రీ కందుల దుర్గేష్ గారి ఆదేశాల మేరకు నిడదవోలు జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు రంగా రమేష్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు.నిడదవోలు మండలం శంకరాపురం గ్రామంలోని హృదయాలయం ఉచిత మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాల, పునరావాస కేంద్రంలో గత 15 సంవత్సరాలుగా పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా పాఠశాలకు అవసరమైన నిత్యావసర సరుకులను అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రంగా రమేష్, లలిత జ్యువెలరీ అంకిత్, చెన్నపురపు రాజశేఖర్ (రాజా), అబ్దుల్ షబీర్, చిపాటి శివ, అరిగెల ప్రదీప్, ఆదిశేషు, బచ్చు నాని తదితరులు సహకరించారు.ఈ కార్యక్రమంలో నిడదవోలు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు హృదయాలయం నిర్వాహకులు గణేష్, విశాలాక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.




## డి సురవరంలో ఉచిత వైద్య శిబిరం

**మాడుగుల సెప్టెంబర్ 3 జయ జయహే**

అంతర్జాతీయ వాసవి క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు కే సి గుప్తా జయంతి వారోత్సవాలులో భాగంగా గురువారం చీడికాడ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో దండి సురవరం గ్రామంలో ఉచిత వైద్య సిబ్బంది నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిపి షుగర్ టెస్ట్ లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్బు పి ఎస్ టి లు, సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు. అలాగే గ్రామీణ క్రీడల్లో భాగంగా క్లబ్ సభ్యులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు.




## డిగ్రీ కళాశాలలో ప్రపంచ కొబ్బరి దినోత్సవం

**మాడుగుల సెప్టెంబర్ 3 జయజయహే**

మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల బోటనీ విభాగం ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ కొబ్బరి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చోడవరం కళాశాల నుండి బోటనీ ఉపన్యాసకులు డాక్టర్ పద్మావతి, అర్థశాస్త్ర ఉపన్యాసకులు డాక్టర్ లక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ కొబ్బరి చెట్టు ప్రాముఖ్యతను, కొబ్బరి వల్ల ప్రజలకు రైతులకు కలిగే వివిధ ప్రయోజనాలను వివరించారు. కొబ్బరి ఆహారంగా, ఔషధపరంగా, ఆర్థికంగా ఎంతో ఉపయోగకరమైనదని తెలిపారు. కొబ్బరి సాగు ద్వారా రైతులు ఉపాధి, ఆదాయం పొందడంతో పాటు కొబ్బరి ఆధారిత ఉత్పత్తుల ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని పేర్కొన్నారు.కొబ్బరి నీరు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, కొబ్బరి కాయ, నూనె, పీచు, ఆకులు మరియు చెట్టు ఇతర భాగాలు వివిధ అవసరాలకు ఉ పయోగపడతాయని విద్యార్థులకు తెలియజేశారు. కొబ్బరి సాగు, ఉత్పత్తుల వినియోగం మరియు మార్కెటింగ్‌కు సంబంధించిన అంశాలపై కూడా అవగాహన కల్పించారు. సభకు అధ్యక్షత వహించినకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. జయ మాట్లాడుతూ, ఇటువంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల్లో వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ సహజ వనరుల ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. బోటనీ విభాగం నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, బోటనీ విభాగం సిబ్బంది విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నేడు సామూహిక సుహాసిని పూజలు

**మాడుగుల, సెప్టెంబర్ 3 జయ జయహే**

శ్రావణమాసం నాలుగో శుక్రవారం పురస్కరించుకొని మాడుగుల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో సామూహిక సుహాసిని కుంకుమ పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు రఘుబాబు గురువారం తెలిపారు.ఉదయం10 గంటలకు మహిళ అంత హాజరుకావాలని కోరారు. అయితే పూజలో పాల్గొనే మహిళలు వంద రూపాయలు చెల్లిస్తే పూజ సామాగ్రి ఆలయంలో అందజేస్తామని పువ్వులు మాత్రం తెచ్చుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని మహిళలతో ఉపయోగించుకోవాలని కోరారు.





## 185 మంది రైతులకు నూతన పట్టాదారు పాస్‌పుస్తకాలు

**రేణిగుంట, సెప్టెంబర్ 03, జయ జయహే**

రేణిగుంట మండలంలోని ఎస్‌యూ పురం గ్రామంలో 185 మంది రైతులకు నూతన పట్టాదారు పాస్‌పుస్తకాలను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పంపిణీ చేశారు. అలాగే గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీలో భాగంగా తాగునీటి సమస్య పరిష్కారానికి ఏర్పాటు చేసిన బోరును ఎమ్మెల్యే ప్రారంభించి గ్రామ ప్రజలకు అంకితం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. రెండు నెలల క్రితం ఎస్‌యూ పురం గ్రామ ప్రజలు తాగునీటి సమస్యను తన దృష్టికి తీసుకురావడంతో వెంటనే అధికారులతో మాట్లాడి బోరు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. బోరు పనులు పూర్తికావడంతో గ్రామస్తుల తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రారంభించినట్లు చెప్పారు. అనంతరం గ్రామానికి చెందిన 185 మంది రైతులకు నూతన పట్టాదారు పాస్‌పుస్తకాలను అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో పట్టాదారు పాస్‌పుస్తకాలపై అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలను ముద్రించడం ద్వారా రైతుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ తీసుకున్న నిర్ణయంతో ముఖ్యమంత్రి ఫొటోలను తొలగించి, అధికారిక రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాలను రైతులకు అందిస్తున్నామని తెలిపారు.కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే గ్రామ ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట తహసీల్దార్ శ్రావణ్ కుమార్, రెవెన్యూ అధికారులు, కూటమి నాయకులు, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించాలి

**విశ్రాంత ప్రిన్సిపల్ పేడాడ**

**హిరమండలం, సెప్టెంబర్ 3 జయ జయహే**

విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని, ముఖ్యంగా క్రమశిక్షణ ఎంత అవసరమని విశ్రాంత ప్రిన్సిపాల్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీత పేడాడ రాంబాబు విద్యార్థులకు హితవు పలికారు. గురువారం శ్రీకాకుళం జిల్లా హిరమండలం రామేశ్వరి విద్యాసంస్థల లో నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యంతో ముందుకు సాగాలని తల్లిదండ్రులు కలలు ఆశయాలు నిజం చేయాలని సూచించారు. ఈ వయసులో పరిపరి విధాలుగా ఆలోచనలు వస్తాయని కానీ ప్రతి విద్యార్థి విద్య పైన ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా గురువు పట్ల గౌరవంతో వ్యవహరిస్తూ ప్రస్తుత పరిస్థితుల్లో అవసరమయ్యే ఉన్నత విద్యలు పట్ల ఆసక్తి పెంచుకోవాలని తద్వారా భవిష్యత్తు బంగారు బాట వేసుకోవాలని ఆయన సూచించారు. మన వల్ల మన గ్రామానికి మన కళాశాలకు మన తల్లిదండ్రులకు మంచి పేరు రావాలని చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల డిటెక్టర్ గోపాలరావు,ప్రిన్సిపాల్ కె అప్పల రామ్, అధ్యాపకులు బుచ్చుబ్బాయి గణపతి రాంప్రసాద్ తదితరులు కూడా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు.



## పాడి రైతులకు ప్రోత్సాహకాలు పంపిణీ

**శ్రీకాళహస్తి ,సెప్టెంబర్ 03,జయ జయహే**

శ్రీకాళహస్తి కో ఆపరేటివ్ పాల సరఫరా సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో నూతన పాలకోవా తయారీ భవనం ప్రారంభోత్సవం, పాడి రైతులకు ప్రోత్సాహకాల పంపిణీ కార్యక్రమం శివం కళ్యాణమండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ ముఖ్యఅతిథిగా హాజరై నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బొజ్జల బృందమ్మ మాట్లాడుతూ పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి, వారి కష్టానికి తగిన ప్రతిఫలం అందించేందుకు కో-ఆపరేటివ్ సంఘాలు నిరంతరం కృషి చేస్తున్నాయని తెలిపారు. స్థానిక పాల ఉత్పత్తులకు ఆధునిక సాంకేతికతను జోడించి నాణ్యమైన పాలకోవా తయారీ కోసం నూతన భవనాన్ని అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. దీని ద్వారా ఉత్పత్తుల మార్కెటింగ్ పెరిగి సంఘంతో పాటు పాడి రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. అనంతరం సంఘం పరిధిలోని పాడి రైతులకు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ ప్రోత్సాహకాలు రైతులను మరింత ఉత్సాహంగా పాల ఉత్పత్తి వైపు ప్రోత్సహిస్తాయని తెలిపారు. పాడి రైతుల సంక్షేమం కోసం సంఘం పాలకమండలి, నిర్వాహకులు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కో-ఆపరేటివ్ పాల సరఫరా సంఘం పాలకమండలి సభ్యులు, డైరెక్టర్లు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో పాడి రైతులు పాల్గొన్నారు.



## నీరు లేక ఎండుతున్న వరి నాట్లు...

**అధికారుల నిర్లక్ష్యమే కారణమంటున్న రైతులు..**

**కొయ్యూరు : (జయ జయహే ) న్యూస్ సెప్టెంబర్ 04,**

కొయ్యూరు మల్లికార్జున చెక్ డ్యాం మరమ్మతు పనులు తూతూ మంత్రంగా చేశారని, లక్షల రూపాయలు స్వాహా చేశారని రైతులు ఆరోపిస్తున్నారు.ఈ చెక్ డ్యాం నీటి ఆధారంగా సుమారు 600 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాభావం వల్ల 20 ఎకరాల్లోపే వరి నాట్లు వేశారు. అయితే మరమ్మతులు సక్రమంగా చేయకపోవడంతో వేసిన నాట్లకు కూడా నీరు అందడం లేదని, నీరు లేక నాట్లు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రెండు మూడు దఫాలుగా చెక్ డ్యాం మరమ్మతులకు లక్షల రూపాయలు మంజూరైనప్పటికీ సక్రమంగా పనులు చేయలేదని విమర్శిస్తున్నారు. ఈ వేసవిలోనూ లక్షల రూపాయలు మంజూరయ్యాయి. కుడి కాలువకు నీరు రాకుండా కాలువలో అరడుగు ఎత్తులో కాంక్రీట్ వేశారని, ఇది కావాలనే కాంట్రాక్టర్ చేశాడని రైతులు ఆరోపిస్తున్నారు.దీనివల్ల కుడి, ఎడమ కాలువలకు నీరు సరిగా ప్రవహించడం లేదని, పొర్లు గట్టు నుండి నీరు లీక్ అయి వృధాగా పోతోందని తెలిపారు. చెక్ డ్యాం మధ్యలో పూడిక తీసి, లీకేజీలు పూడ్చి ఉంటే నీరు వృధా అయ్యేది కాదని రైతులు సూచిస్తున్నారు.ఇంజనీరింగ్ సిబ్బంది పర్యవేక్షణ లోపం వల్లే కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు చేశాడని ఆరోపిస్తూ, ఉన్నతాధికారులు విచారణ జరిపి కాలువలకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## ఈ నెల 6వ తేదిన ఉచిత ఆయుర్వేద శిబిరం

**విశాఖపట్నం ఏయూ క్యాంపస్ జయజయహే**

'సెప్టెంబర్ 6 వ తేదిన ఉచిత ఆయుర్వేద శిబిరం నిర్వహిస్తున్నట్లు యోగా కేంద్ర సంచాలకులు ఆచార్య కె.రమేష్ బాబు ప్రకటనలో తెలిపారు . ఏయూ యోగా కేంద్రంలో ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు శిబిరం నిర్వహిస్తామన్నారు . కెజిహెచ్ విశ్రాంత ఆయుర్వేద వైద్యులు డాక్టర్ కె.ఈశ్వరరావు స్వయంగా రోగులను పరిశీలించి చికిత్స అందిస్తారు .ఈ అవకాశాన్ని ప్రజలు , దీర్ఘకాల సమస్యలతో బాధపడేవారు సద్వినియోగం చేసుకోవాలని శిబిరం నిర్వాహకులు కోరారు .

## సెప్టెంబర్ 5 నుండి ఏయూ డిస్టెన్స్ జువాలజీ ప్రాక్టికల్స్

**విశాఖపట్నం ఏయూ క్యాంపస్ జయజయహే**

'సెప్టెంబర్ 5 వ తేది నుండి ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య జువాలజీ సబ్జెక్ట్ ప్రాక్టికల్ తరగతులు నిర్వహించనున్నారు.సెప్టెంబర్ 12 వ తేది వరకు 8 రోజులు తరగతులు చేపడతారు . సెప్టెంబర్ 13 వ తేదిన ఎమ్మెస్సీ జువాలజీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ ప్రాక్టికల్ పరీక్ష నిర్వహిస్తారు . అయా తేదిల్లో నిర్వహించే తరగతులకు విద్యార్థులు తప్పని సరిగా హాజరు కావాలని లేని పక్షంలో పరీక్షకు అనుమతి లేదని నోటిసులో స్పష్టం చేశారు .



## ఆర్.ఓ.బీ పనులతో ప్రజలకు ఇబ్బందులు..బయ్యే మునీంద్ర...

**ప్రత్యామ్నాయ మార్గం చూపాలని బీఎస్పీ నాయకుల డిమాండ్**

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

నిడదవోలు ఆర్.ఓ.బీ పనులు సంవత్సరాలుగా కొనసాగుతున్న నేపథ్యంలో శెట్టిపేట, తాళ్లపాలెం మీదుగా నిడదవోలు వెళ్లే ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బహుజన సమాజ పార్టీ నాయకులు విమర్శించారు. ప్రజలకు ప్రత్యామ్నాయ మార్గం చూపకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.శెట్టిపేట, తాళ్లపాలెం గ్రామాల్లో అత్యవసర పరిస్థితుల్లో ప్రమాదం జరిగితే అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలు చేరుకునే పరిస్థితి లేదని తెలిపారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి ప్రజలకు అనుకూలమైన ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమస్యపై బీఎస్పీ నాయకులు నిడదవోలు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్లమెంట్ ఇంచార్జ్ బయ్యే మునీంద్ర, నియోజకవర్గ ఉపాధ్యక్షులు అంబటి పుల్లారావు, సత్తిపండు, శ్రీ సూర్య, కోడి చిన్నోడు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కృష్ణ గ్రామర్ స్కూల్ అధినేతకు మాతృవియోగం

**ఆరిలోవ (జయ జయహే),**

శ్రీకృష్ణ గ్రామర్ స్కూల్ అధినేత మరియు విశాఖపట్నం నాగవంశం సంక్షేమ సంఘం అధ్యక్షులు ముని మోహన్ కృష్ణ మాతృమూర్తి కీర్తిశేషులు ముని పైడితల్లి గురువారం నాడు అకాల మరణం చెందడంతో ఆరిలోవ గ్రామ ప్రజలు, స్కూల్ సిబ్బంది నివాలార్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు, నాగవంశ సమాజానికి మరియు కుటుంబ సభ్యులకి తీరని లోటు అని నాగవంశ కులస్థులు ఆవేదన వ్యక్తం చేసారు అంత్రక్రియలు శుక్రవారం ఉదయం ఎనిమిది గంటలకి డైరీ ఫారం ఆదర్శనగర్ తమ స్వగృహం నుండి ప్రారంభమవుతాయని కుటుంబ సభ్యులు తెలియచేసారు



For a pure tomorrow.. జయహే

# జనసేన పార్టీ నా కుటుంబం

### పవన్ కళ్యాణే మా దేవుడు

### అనకాపల్లి పార్లమెంటరీ సాధక్ ప్రతినిధి గొన్న రమాదేవి

**ఉక్కునగరం, సెప్టెంబర్ 3, జయ జయహే :**

జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ 54వ జన్మదిన వేడుకలు 85వ వార్డు గొన్నవానిపాలెంలో పెందుర్తి జనసేన నాయకురాలు గొన్న రమాదేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జన్మ దిన సందర్భంగా మూడు రోజులు పలు కార్యక్రమాలు నిర్వహించారు. మొదటి రోజు ఏడు మెట్ల మర్రిపాలెం గ్రామంలో గత నెల రోజుల క్రితం ప్రమాదవశాత్తు మృతి చెందిన లైన్మెన్ తోకాడ దుర్గారావు కుటుంబానికి రూ. 10 వేల ఆర్థిక సహాయంతో పాటు రెండు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులు అందజేశారు, రెండవ రోజు పర్యావరణ పరిరక్షణ కొరకు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఆఖరి రోజు పుట్టినరోజు సందర్భంగా గొన్నవానిపాలెం లో సంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతో పాటు 54 కేజీల భారీ కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమానికి పరవాడ జనసేన పార్టీ ఇంచార్జ్ పంచకర్ల ప్రసాద్ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనసేన పార్టీ ఆవిర్భావం నుండి ఆ పార్టీలో పనిచేసి పవన్ కళ్యాణ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి సాయి శక్తుల కృషి చేస్తున్నానని, తాను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి పని చేసే పవన్ కళ్యాణ్ లాంటి నాయకుడి నాయకత్వంలో జనసేన




పార్టీలో తన కుటుంబం మొత్తం పనిచేయడం తనకి ఎప్పుడూ సంతృప్తినిస్తుందని అన్నారు. ముఖ్యంగా పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అడుగుజాడల్లో పని చేస్తూ గ్రామంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసుకున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు 85 వార్డు టిడిపి అధ్యక్షుడు కర్రిదసేంద్ర, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి బుగిడి రామ గోవిందరావు,రాష్ట్ర తూర్పుకాపు సంఘం అధ్యక్షులు ఆకుల అప్పలసూరి, ఎడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, బిజెపి అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షులు పట్టాభి ప్రసాద్, బిజెపి పరవాడ మండల పార్టీ అధ్యక్షులు పిల్లా సతీష్, పరవాడ మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు మడక పార్వతి రమేష్, జీవీఎంసీ అగనంపూడి మండల అధ్యక్షులు కోసూరి తాతారావు, దత్తి శ్రీనివాసరావు, బంతి కోరు గోవిందరాజు, బిజెపి లీగల్ సెల్ అధ్యక్షులు అంగులూరి ఈశ్వరరావు రాఘవపురపు శ్రీనివాస్ కుమార్, తెలుగుదేశం నాయకులు గొల్లవిల్లి నాగరాజు, దానబోయిన నీలకంఠరావు, తదితరులు పాల్గొన్నారు.



## చైతన్యవంతమైన వినియోగదారులను తయారు చెయ్యండి: భీశెట్టి

విజయనగరం (జయ జయహే) వినియోగదారుల హక్కుల పరిరక్షణ కమిటీ(డిసిపీసీ) సభ్యులుగా చైతన్య వంతమైన వినియోగదారులను తయారు చేసి వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి చెయ్యాలని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి నూతనంగా డిపీసీ సభ్యులు గా నియమితులైన పి. సుధా బ్రహ్మనాయుడు, ఎమ్. చంద్రశేఖర్ లను కోరారు, డిసిపీసీ సభ్యులు ప్రభుత్వం నుండి నియమితు లైన ఇద్దరినీ ముందుగా అభినందించిన అనంతరం భీశెట్టి బాబ్జి మాట్లాడుతూ మార్కెట్ లో ఊహించని రరీ తిలో కల్తీలు, మోసాలు, అబద్దపు ప్రకటనలు పెచ్చు మీ రిపోయాయని, ఆన్లైన్ మోసాలకు అంతులేదని రైతులకు అమ్మే పురుగు మందులు, విత్తనాలు, ఎరువుల్లో కూడా అంతులేని దోపిడీ జరుగుతోందని వీటిని అరికట్టవలసిన అధికారులకు తగిన సిబ్బంది, మౌలిక సదుపాయాలు లేక మౌనం వహిస్తున్నారని కొన్ని డిపార్ట్మెంట్లు ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి వినియోగదారులకు ఉందని సవరించిన వినియోగదారుల చట్టం 2019 ప్రకారం వినియోగదారులకు హక్కుల తో పాటు బాధ్యతలు కూడా ఉన్నాయని ప్రతి వినియోగదారుడు కొన్న ప్రతి వస్తువులుకు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని డిసిపీసీ సభ్యులుగా వినియోగదారుల సమస్యలు గుర్తించడం, సంబందించిన అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం, శాఖల మధ్య సమన్వయం చెయ్యడం, ప్రజల్లో అవగాహన కల్పించడం, ప్రభుత్వానికి సలహాలు ఇవ్వడం చెయ్యాలని యువతకు వినియోగదారుల చట్టంపై ప్రత్యేక సదస్సులు ఏర్పాటు చేసి అవగాహనా పెంచాలని సభ్యులను కోరారు.



### కష్ట సమయంలో ఉన్నవారికి సహకారం

## చేయడం మానవత్వం

### తోటి స్నేహితురాలికి

### వైద్య నిమిత్తం రూ 60 వేలు సహకారం

**భీమవరం :( జయ జయహే)**

కష్ట సమయంలో ఉన్నవారికి సహకారం చేయడం మానవత్వాన్ని చాటుకోవడమేనని లూథరన్ హై స్కూల్ 1977 సం రం 10 వ తరగతి పూర్వ విద్యార్థుల కన్వీనర్ బొండా రాంబాబు, డిఎస్పీ ప్రసాదరావు, శివ భాను అన్నారు. విజయవాడ వాసి, తోటి స్నేహితురాలు సుగుణ కు అనారోగ్యంతో బాధపడుతుందన్న విషయాన్ని తెలుసుకున్న తోటి మిత్రులు స్పందించి గురువారం వైద్య ఖర్చుల నిమిత్తం రూ 60 వేలు ఆర్థిక సహకారాన్ని అందించారు. కారుమూరి భాస్కరరావు,కమలాకర్ మాట్లాడుతూ సృష్టి లో తీయనిది స్నేహ బంధమని, మన స్నేహితులు ఇబ్బందుల్లో ఉంటే తక్షణం స్పందించడం స్నేహంలోని మాధుర్యాన్ని చుట్టుకుంటుందన్నారు. అయితా వెంకట కృష్ణారావు, మద్దుల అప్పాజి, నూకల సత్యనారాయణ లు మాట్లాడుతూ వారికీ ఎల్లప్పుడూ అండగా ఉంటామని అన్నారు. సుగుణ కుమార్తె హిమబిందు మాట్లాడుతూ మా తల్లి ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని సహకారం అందించిన మా తల్లి గారి స్నేహితులకు పేరు పేరున మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు.



### ఆర్టీసీ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు

## పరిష్కరించాలి

**విజయనగరం (జయ జయహే)**

విజయనగరం ఆర్టిసి కాంప్లెక్స్ వద్ద ఆర్టీసీ ఔట్సోర్సింగ్ జిల్లా స్థాయి సమావేశం ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేయడం జరిగింది.ఆర్టీసీలో పని చేస్తున్న 8 వేల మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ జోనల్ సెక్రెటరీ బి కే మూర్తి మాట్లాడుతూ ఆర్టీసీలో థర్డ్ పార్టీ విధానం వల్ల కార్మికులు చాలా నష్టపోతున్నారని ప్రతి ఒక్క కాంట్రాక్టర్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల నుంచి 4000 వరకు కోత విధిస్తున్నారని తెలిపారు . ఆర్టీసీ ఔట్సోర్సింగ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఏ అశోక్ మాట్లాడుతూ కార్మిక శాఖ నిర్ణయించిన జీతాలు రాష్ట్రం మొత్తం మీద ఏ జిల్లాలో ఏ కార్మికుడు అందుకునే పరిస్థితి లేదని అన్నారు, మా యొక్క న్యాయ సమస్యలు పరిష్కార కానుచో రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేయడానికి చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు, ఈ యొక్క కార్యక్రమంలో విజయ నగరం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ డిపో ప్రెసిడెంట్ కే.ఎన్.స్వామి, ఏపీపిటిడి ఆర్టీసీ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ అధ్యక్షులు తిరుపతిరావు జిల్లా ట్రెజరీ శివ అత్యధిక సంఖ్యలో ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.



### నేడే చంద్రశేఖర్ మహాస్వామి పిరమిడ్

## ధ్యాన కేంద్రం 8వ వార్షికోత్సవం

**మునగపాక, సెప్టెంబర్ 3, జయ జయహే:**

మండలంలోని నాగులపల్లి గ్రామంలో గల చంద్రశేఖర మహాస్వామి పిరమిడ్ ధ్యాన కేంద్రం ఎనిమిదవ వార్షికోత్సవం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ఘనంగా నిర్వహించినట్లు ధ్యాన గురువు పి.సుజాత తెలిపారు. ప్రముఖ ధ్యాన గురువులు తమ ధ్యాన అనుభవాలను ఈ కార్యక్రమంలో వివరించడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఉంటాయని, కృష్ణ భక్తులు జ్ఞాన భక్తులు తప్పనిసరిగా ఈ కార్యక్రమానికి విచ్చేయాలని సుజాత కోరారు.



### ఘనంగా ముందస్తు

## కృష్ణాష్టమి వేడుకలు

**బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబర్ 3, జయ జయహే**

బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని స్థానిక విద్యాస్ వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో కరెస్పాండెంట్ విద్యా ప్రకాష్ రెడ్డి అధ్యక్షతన, ప్రిన్సిపాల్ సాయి కుమార్ ఆధ్వర్యంలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సాయి కుమార్ మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ముస్తాబై వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు.చిన్నారుల కృష్ణుడు, గోపికల వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయని తెలిపారు. శ్రీకృష్ణుడు ధర్మం, సత్యం, కర్తవ్యనిష్ఠ, మంచి మార్గంలో నడవడం వంటి గొప్ప విలువలను బోధించారని, వాటిని విద్యార్థులు తమ జీవితాల్లో ఆచరించాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవడం కూడా విద్యార్థులకు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.అనంతరం విద్యార్థులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




### పేద టీబీ రోగులకు

## పోషకాహారం పంపిణీ

### 20 మంది రోగులకు రూ.800 విలువైన ఆహార పదార్థాలు అందజేత

**తిరుపతి, సెప్టెంబర్ 03, జయ జయహే**

తిరుపతి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రకాశం రోడ్డు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి. బాలకృష్ణ నాయక్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాతయ్యగుంట గంగమ్మ గుడి చైర్మన్ మహేష్ యాదవ్ 20 మంది పేద టీబీ రోగులకు ఒక్కొక్కరికి రూ.800 విలువైన పోషకాహారాన్ని ఉచితంగా పంపిణీ చేశారు. కందిపప్పు, వంటనూనె, వేరుశనగలు, రాగిపిండి, గోధుమపిండి, శనగపప్పు, హార్లిక్స్ తదితర పోషకాహార పదార్థాలను రోగులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి. బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ.. మహేష్ యాదవ్‌ను ఆదర్శంగా తీసుకుని మరింత మంది దాతలు ముందుకు వచ్చి పేద టీబీ రోగులకు పోషకాహారం అందించాలని కోరారు. టీబీ నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని తెలిపారు. జిల్లా లెప్రసీ, టీబీ అధికారి డాక్టర్ శైలజ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో టీబీ రోగులకు మందులు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా మందులు వాడితే టీబీ వ్యాధి పూర్తిగా నయమవుతుందని చెప్పారు. నిశ్చయ పోషణ్ పథకం కింద టీబీ మందులు వాడుతున్న ఆరు నెలల కాలంలో పోషకాహారం కోసం ప్రతి నెలా రూ.1,000 చొప్పున రోగుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీధర్, రుయా ఆసుపత్రి పల్మనాలజీ ప్రొఫెసర్ డాక్టర్ సుబ్బారావు, ప్రకాశం రోడ్డు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ క్రాంతికుమార్, టీబీ విభాగం సిబ్బంది లోకేష్, మురళి, మోహిద్దీన్, ఆరోగ్య సిబ్బంది, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### చిన్న సినిమాలను

## ప్రోత్సహించాలి: హీరో కృష్ణసాయి

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 03, జయ జయహే**



శ్రీకాళహస్తి చిన్న సినిమాలను ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఆర్టిస్ట్ ప్రమోషన్లలో భాగస్వామి కావాలని హీరో కృష్ణసాయి అన్నారు. ఇటీవల విడుదలైన తన చిత్రం 'పోలీస్ కంప్లైంట్' విజయవంతం కావడంతో గుర-ువారం శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకున్న ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. నటి వరలక్ష్మి శరత్‌కుమార్‌కు పూర్తి పారితోషికంతో పాటు ప్రమోషన్ల కోసం ఐదు రోజుల అమౌంట్ కూడా చెల్లించినప్పటికీ ఆమె ప్రచార కార్యక్రమాలకు హాజరు కాలేదని తెలిపారు. చిన్న సినిమాలను నిలబెట్టేందుకు ప్రతి నటీనటుడు బాధ్యతగా ప్రమోషన్లలో పాల్గొనాలని కోరారు. అయితే వరలక్ష్మికి వ్యక్తిగత కారణాలు ఉండవచ్చని, వాటిపై తాను వ్యాఖ్యానించబోనన్నారు. పోలీస్ కంప్లైంట్ చిత్రం థియేటర్లతో పాటు అమెజాన్ ప్రైమ్ వీడియోలోనూ ఆదరణ పొందుతోందని తెలిపారు. త్వరలో ఇదే బ్యానర్, దర్శకుడి కలయికలో మరో చిత్రాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అనంతరం ఆలయ అధికారులు, అర్చకులు కృష్ణసాయిని శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

# జిమ్ ట్రైనర్ హత్య కేసు నిందుతులను
# చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు

### జిమ్ ట్రైనర్ హత్య కేసులో నలుగురి అరెస్టు

### మార్ఫింగ్ ఫొటోలే హత్యకు కారణం

**కాకినాడ (జయ జయహే)**



అదనపు ఎస్పీ కిషోర్‌కుమార్ వెల్లడి కాకినాడ భానుగుడి సెంటర్‌లో జిమ్ ట్రైనర్ కొడమాటి సతీష్‌రెడ్డి హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు కాకినాడ జిల్లా అదనపు ఎస్పీ, కాకినాడ ఇన్‌చార్జి ఎస్‌డీపీవో డాక్టర్ మహంతి కిషోర్‌కుమార్ తెలిపారు. గురువారం కాకినాడ డివిజనల్ పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. కాకినాడ రామకృష్ణారావుపేటకు చెందిన సతీష్‌రెడ్డి ఆగస్టు 26న తెల్లవారుజామున 2 గంటల సమయంలో భానుగుడి సెంటర్‌లోని చార్మినార్ టీ సెంటర్ వద్ద హత్యకు గురయ్యాడు. మృతుడి స్నేహితుడైన బొందల సాయికిరణ్‌తో పాటు ఇంటి సత్యనారాయణ, ప్రయాగ దుర్గాప్రసాద్, ఇంటి ఆదికృష్ణ కలిసి సతీష్‌రెడ్డిపై దాడి చేసినట్లు దర్యాప్తులో తేలింది. మొదట కాళ్లతో తన్నడంతో పాటు చెక్కబద్దతో తల, ముఖం, శరీరంపై దాడి చేశారు. చెక్కబద్ద విరిగిపోవడంతో దాని పదునైన ముక్కతో సాయికిరణ్ సతీష్‌రెడ్డి గొంతులో పలుమార్లు పొడిచినట్లు పోలీసులు తెలిపారు.

**మార్ఫింగ్ ఫొటోలపై విభేదాలు**

ప్రధాన నిందితుడు సాయికిరణ్‌కు ప్రేమ వ్యవహారానికి సంబంధించి సతీష్‌రెడ్డితో విభేదాలు ఏర్పడ్డాయని పోలీసులు తెలిపారు. సాయికిరణ్ మరో యువతితో ఉన్నట్లుగా సతీష్‌రెడ్డి మార్ఫింగ్ చేసిన ఫొటోలను అతని ప్రియురాలికి పంపడంతో ఇద్దరి మధ్య వివాదం తలెత్తినట్లు విచారణలో వెల్లడైందన్నారు. సతీష్‌రెడ్డి తనను చంపుతానని బెదిరించడంతో, అతను బతికి ఉంటే తనకు ప్రాణహాని ఉంటుందనే ఉద్దేశంతో హత్యకు పాల్పడినట్లు సాయికిరణ్ విచారణలో వెల్లడించినట్లు తెలిపారు. టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఎస్సైలు సువర్ణకుమారి, ఎల్ భీష్మకుమార్, పి సత్తిబాబు, పోలీసు, క్రైమ్ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. విశ్వసనీయ సమాచారంతో రైల్వే స్టేషన్ పార్కింగ్ వద్ద పోలీసులు మాటువేసి ఉండగా, బుధవారం సాయంత్రం బుల్లెట్‌ను తీసుకునేందుకు వచ్చిన నలుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, బుల్లెట్ మోటార్‌సైకిల్, ఘటన సమయంలో ధరించిన దుస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించనున్నట్లు అదనపు ఎస్పీ తెలిపారు. కేసును ఛేదించి నిందితులను అరెస్టు చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అభినందించారు.

## పండగ వాతావరణంల ఇంటింటికి తెదేపా ప్రచారం

**కోడా వెంకట సురేష్ కుమార్**

**పాడేరు (జయ జయహే)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తెలుగు దేశం పార్టీ శ్రేణులు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకునీ తెదేపా అధికారం చేపట్టిన తర్వాత చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజాల ముందుకుతీసుకొనివెళ్లాలనే ఉద్దేశంతో ఇంటింటికి పార్టీ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్న భాగంగానే రాష్ట్ర తెలుగు యువత కార్య నిర్వహణ కార్యదర్శి కోడా వెంకట సురేష్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం పాడేరు మండలం మోదపల్లి పంచాయతీ పరిధిలో మోదపల్లి గ్రామంలో పండగ వాతావరణంలో ఇంటింటికి తెదేపా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం చేసినా అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు వివరిస్తూ ప్రజలకు చైతన్యం కల్పిస్తూ ప్రచారం ముమ్మరం చేశారు. .ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జీ తామర మూర్తి బాబు, కొంతేలి వెంకట ప్రసాద్, జగందొర చంటిబాబు, కు న్మాల్ రావు, విష్ణు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



## విశాఖలో చాంతాడులా రైల్వే సమస్యలు.....!

### కేంద్రంతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించాలి

### మీ పలుకుబడిని ఢిల్లీ కేంద్రంగా ప్రయోగించండి

### ఎంపీ శ్రీ భరత్‌ను కోరిన రైల్వే జాతీయ కార్మిక సీనియర్ నాయకులు చలసాని గాంధీ

**విశాఖపట్నం, సెప్టెంబర్ 3, జయ జయహే :**



విశాఖ కేంద్రంగా ఉన్న దక్షిణ కోస్తా రైల్వే ప్రధాన కార్యాలయం విశాఖపట్నంలో ఉండడం ఈ ప్రాంతానికి ఒక విశేష అవకాశం. ఉన్నతాధికారులు స్థానికంగానే అందుబాటులో ఉండటం వల్ల అభివృద్ధి పనులపై తరచూ సమీక్షలు నిర్వహించడం, సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించడం, అవసరమైన నిధులు మరియు పరిపాలనా అనుమతులను వేగంగా సాధించడం సులభమవుతుంది. ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించి విశాఖపట్నం డివిజన్‌ను దేశంలోనే అత్యుత్తమ ప్రయాణికుల సేవలు అందించే డివిజన్‌గా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. ఈ అంశాలన్నింటిని దృష్టిలో ఉంచుకుని దక్షిణ కోస్తా రైల్వే, రైల్వే బోర్డు మరియు కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖతో సమన్వయం చేస్తూ పలు కీలక అంశాలపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని విశాఖ ఎంపీ శ్రీ భరత్‌ను భారతీయ రైల్వే సీనియర్ కార్మిక నేత చలసాని గాంధీ కోరారు. ఈ మేరకు ఎంపీని కలసి గురువారం విజ్ఞాపన పత్రం అందజేశారు. ఈ విజ్ఞాపనలో రైల్వే ప్రయాణీకులు గత కొన్నేళ్లుగా ఎదుర్కొంటున్న అనేక సమస్యలను సవినయంగా విజ్ఞప్తి చేశారు. ఆ లేఖలోని అంశాలు ఇలా ఉన్నాయి. విశాఖపట్నం–గోపాలపట్నం మధ్య మూడో, నాలుగో రైల్వే లైన్ల నిర్మాణాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయించాలి.

విశాఖపట్నం రైల్వే స్టేషన్ విస్తరణ పనులను వేగవంతం చేసి, ప్లాట్‌ఫారాల సంఖ్యను ఎనిమిది నుంచి పద్నాలుగుకు పెంచే ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలి. జ్ఞానాపురం వైపు స్టేషన్ విస్తరణ, కోచింగ్ యార్డు ఆధునీకరణ, సిగ్నలింగ్ వ్యవస్థల అభివృద్ధి, ప్రయాణికుల సౌకర్యాల కల్పనకు అవసరమైన నిధులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలి.

విశాఖపట్నం టెర్మినల్ స్టేషన్‌పై ఉన్న ఒత్తిడిని తగ్గించేందుకు అన్ని రకాల సాధ్యాసాధ్యాలను సాంకేతికంగా పునఃపరిశీలించి,పరిష్కారాలు తక్షణమే అమలు చేయాలి. సింహాచలం నార్త్–దువ్వాడ బైపాస్ మార్గాన్ని విస్తరించి సమర్థవంతంగా వినియోగించే అవకాశాలను పరిశీలించి, ప్రధాన రైళ్ల నిర్వహణకు అవసరమైన సామర్థ్యాన్ని పెంచాలి.

అభివృద్ధి పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించి, అవసరమైతే రైల్వే బోర్డు, కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ స్థాయిలో ప్రత్యేక చొరవ తీసుకుని పెండింగ్‌లో ఉన్న అనుమతులు, నిధులు త్వరగా మంజూరయ్యేలా చర్యలు చేపట్టాలి.

విశాఖపట్నం డివిజన్‌ను సరుకు రవాణాలోనే కాకుండా ప్రయాణికుల సేవలలో కూడా దేశంలోనే ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలంటూ కోర్కెల చిట్టాను సమర్పించారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులు వేగంగా పూర్తయితే విశాఖపట్నం రైల్వే వ్యవస్థ సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని, సమయపాలన మెరుగుపడటంతో పాటు ప్రయాణికులకు నాణ్యమైన సేవలు అందుబాటులోకి వస్తాయని సూచించారు. అలాగే రైల్వే సిబ్బందిపై ఉన్న నిర్వహణ ఒత్తిడి కూడా తగ్గి, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విశాఖపట్నం డివిజన్ మరింత సమర్థవంతంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల దీర్ఘకాల ఆకాంక్షలకు అనుగుణంగా ఈ అభివృద్ధి కార్యక్రమాలు త్వరితగతిన పూర్తయ్యేలా మీ విలువైన సహకారం, చొరవ అందించాలని సవినయంగా విజ్ఞాప్తి చేశారు.

## వేదఘోషతో మార్మోగిన సాయి కుల్వంత్ సభా మండపం

### ప్రత్యేక ఆధ్యాత్మిక సంగీతంతో పరవశించిన భక్తులు

### విశాఖ భక్తుల మూడు రోజుల పర్తి యాత్రకు శుభారంభం

**పుట్టపర్తి, సెప్టెంబర్ 3, జయ జయహే :**



శ్రీ సత్యసాయి బాబా దివ్య సన్నిధిలో విశాఖజిల్లా భక్తులు చేపట్టిన మూడు రోజుల పర్తి యాత్రలో తొలిరోజు భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. దివ్య శ్రీకృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని, విశాఖ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 2 వేల మందికి పైగా భక్తులు పుట్టపర్తికి చేరుకున్నారు. పర్తి యాత్ర తొలిరోజు సందర్భంగా సాయి కుల్వంత్ సభా మండపంలో ఉదయం, సాయంత్రం జరిగిన కార్యక్రమాల్లో విశాఖజిల్లా మహిళా భక్తులు వేదపఠనం నిర్వహించారు. వారి శ్రావ్యమైన వేదఘోషతో సభా మండపం మొత్తం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. అనంతరం సాయంత్రం నిర్వహించిన "మానస సంచరరే" ప్రత్యేక ఆధ్యాత్మిక సంగీత కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మధురమైన భక్తిగీతాలు, హృద్యమైన సంగీత స్వరాలు భక్తులను ఆధ్యాత్మిక భావనలో ముంచెత్తాయి. కళాకారుల అద్భుతమైన గాన ప్రదర్శనకు భక్తుల నుంచి విశేష స్పందన లభించగా, కార్యక్రమం ఆద్యంతం భక్తులు పరవశంతో ఆస్వాదించారు. మూడు రోజుల పర్తి యాత్రలో భాగంగా తొలిరోజునే విశాఖజిల్లా భక్తులు వేదపఠనం, భజనలు, ఆధ్యాత్మిక సంగీత కార్యక్రమాలతో శ్రీ సత్యసాయి బాబా దివ్య సన్నిధిలో తమ భక్తిభావాన్ని చాటారు. విశాఖజిల్లా మహిళా భక్తుల వేదఘోష, భక్తిగీతాలు, మధురమైన సంగీత స్వరాల సమ్మేళనంతో సాయి కుల్వంత్ సభా మండపం భక్తిభావంతో మార్మోగింది. శ్రీ సత్యసాయి బాబా దివ్య సన్నిధిలో ప్రారంభమైన ఈ మూడు రోజుల పర్తి యాత్ర భక్తులకు మరపురాని ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తోంది.



## శర్వాణిలో ముందస్తు "శ్రీకృష్ణ జన్మాష్టమి" మహటరీత్సవం

**శ్రీకాకుళం (జయ జయహే)**

స్థానిక అరసవల్లి కూడలిలోగల 'శర్వాణి విద్యాలయ'లో ముందస్తు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సంస్థ వ్యవస్థాపకులు అంధవరపు సూరిబాబు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక శోభితంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమములో అనేక మంది బాలబాలికలు గోపికా సహిత శ్రీకృష్ణుని వేషధారణలతోను, పాటలతోను, నృత్యాలతో అలరించారు. తదనంతరం 'ఉట్టి ఉత్సవం' జరిపి ప్రసాదమును అందరూ స్వీకరించి భక్తి భావంతో సేవించుట జరిగినది. ఈ సందర్భంగా అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ శ్రీ మహావిష్ణువు దశావతారాలలో అష్టమ అవతారమైన శ్రీకృష్ణుడు భగవద్గీతను అందించి ప్రపంచానికే జగద్గురువు అయినారని, భగవద్గీతను అవగాహన చేసుకుంటే మనల్ని మనం సంస్కరించుకోవటమే కాకుండా ప్రపంచానికే దిశానిర్దేశం చేసే సామర్థ్యం సాధ్యమవుతుందని, దుష్టశిక్షణ, శిష్టరక్షణతో మనిషి ఎలా జీవించాలో శ్రీకృష్ణుని అవతారం ద్వారా చూపించి అడుగడుగునా మానవత్వంలో దైవత్వాన్ని ప్రకటించిన శ్రీకృష్ణుడు జన్మించిన పవిత్ర దినం శ్రీకృష్ణ జన్మాష్టమని, కురుక్షేత్ర మహాసంగ్రామంలో తను ధర్మంవైపు నిలిచి, ధర్మాన్ని జయింపచేసి ఎన్నడూ అధర్మంపై ధర్మమే విజయం సాధిస్తుందనే సందేశాన్ని తెలియజేసారు. కరస్పాండెంట్ ఎ . ఆంజనేయులు మాట్లాడుతూ శ్రీకృష్ణ భగవానుడు ఒక్క మన భారతదేశానికే కాకుండా ప్రపంచానికే మార్గనిర్దేశం చేసారని అందుకే 'కృష్ణం వందే జగద్గురుం' అని శ్రీకృష్ణపరమాత్మను ప్రపంచం కీర్తించినదని, ఆదర్శ స్నేహానికి నిదర్శనం శ్రీకృష్ణుని–సుదాముని చరిత్రని, తాను దైవాంశ సంభూతుడైనా, మానవ జన్మమెత్తిన ప్రతి ఒక్కరికి గురువు అవసరమని తాను సాందీపుని వద్ద విద్యనభ్యసించి, సముద్ర స్నానంలో కోల్పోయిన గురుపుత్రుణ్ణి గురుదక్షిణగా తెచ్చి యిచ్చి గురుభక్తిని సాటిచెప్పారని, ప్రతి విద్యార్థి శ్రీకృష్ణుని వలె గురువు వద్ద సక్రమంగా విద్యనభ్యసించి, స్నేహ ధర్మాన్ని పాటించి ఉన్నత విలువలతో ఎదగాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




## యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

**పెదకూరపాడు,సెప్టెంబర్ 3**

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉన్నప్పుడే లక్ష్యాన్ని చేదించగలుగుతారని పెదకూరపాడు తహసిల్దార్ కుంభా శ్రీనివాసరావు అన్నారు.మేరా యువభారత్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలోనషా ముక్త్ యువ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్‌లో భాగంగా నషా ముక్త్ యువ పల్నాడు జిల్లా స్థాయి పోటీలను జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పెదకూరపాడులోని కాకతీయ కళాశాల ప్రాంగణంలో గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలన్నారు.ఈసందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో యువత, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.సంగీతం, నృత్యం,రీల్,షార్ట్ ఫిల్మ్, నుక్కడ్ నాటక్, కవిత్వం, డిబేట్, స్లోగన్, పెయింటింగ్ విభాగాల్లో యువతీ యువకులకు పోటీలు నిర్వహించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు,ఆరోగ్యకరమైన జీవన విధానం,యువతలో సానుకూల ఆలోచనలు, డ్రగ్–ఫ్రీ ఇండియా వంటి అంశాలపై విద్యార్థులు తమ సృజనాత్మకతను చాటారు. ఈకార్యక్రమములో ముఖ్య అతిథిగా పాల్గొన్న పెదకూరపాడు ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్స్పెక్టర్ వి శ్రీనివాసులుమేరా యువ భారత్, గుంటూరు జిల్లా ఉప సంచాలకులు కిరణ్మయి దేవిరెడ్డి .ప్రసంగించారు ఈకార్యక్రమంలో కాకతీయ జూనియర్,డిగ్రీ కళాశాల డైరెక్టర్ శీలమనేని సాంబశివరావు, ప్రిన్సిపల్ ఈ అశోక్,ప్రజా సంఘాల నాయకులు మునగోటి శ్రీనివాసరావు.జన చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి విజయ్ బెన్నిబాబు,కార్యదర్శి తుళ్లూరి సాంబశివరావు,కోఆర్డినేటర్ వెలితోటీ అనిల్ కుమార్, ప్రతినిధులు షేక్ లియాఖత్ అలీ తదితరులు పాల్గొన్నారు.వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు.



## నేటి నుండి ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**మునగపాక సెప్టెంబర్ 3 జయ జయహే**

మునగపాక మండలంలో పలు గ్రామాలలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నారు దీంట్లో భాగంగా మునగపాక సొంత సొంత బయలు వద్దగల కృష్ణాలయాలలో శ్రీకృష్ణుని విగ్రహం ఏర్పాటు ఊరేగింపు భా భారీ అన్న సమారాధన ప్రత్యేక పూజలు అభిషేకాలు కోలాటాలు ఉంటాయని కృష్ణ ఆ ఆలయ కమిటీ కమిటీ సభ్యులు తెలిపారు కృష్ణాష్టమి సందర్భంగా 9 10 11 తేదీల్లో కృష్ణాష్టమి ఉత్సవాలలో భాగంగా జిల్లా స్థాయి కోలాటం పోటీలు కూడా నిర్వహిస్తున్నట్లు శ్రీకృష్ణ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

# ఈ పండు ఆరోగ్యానికి మేలు

**సాధారణంగా పండు ఏదైనా ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ప్రకృతి సిద్ధంగా లభ్యమయ్యే పండువల్ల ప్రయోజనాలే ఎక్కువగా ఉంటాయి. అయితే ఈ ప్రయోజనాలు కొన్ని పండ్లలో ఎక్కువగా, కొన్ని పండ్లలో తక్కువగా ఉంటాయి. ఇలా ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలు ఉండే పండ్లలో పంపర పనస ఒకటి.**



సాధారణంగా పండు ఏదైనా ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ప్రకృతి సిద్ధంగా లభ్యమయ్యే పండువల్ల ప్రయోజనాలే ఎక్కువగా ఉంటాయి. అయితే ఈ ప్రయోజనాలు కొన్ని పండ్లలో ఎక్కువగా, కొన్ని పండ్లలో తక్కువగా ఉంటాయి. ఇలా ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలు ఉండే పండ్లలో పంపర పనస ఒకటి. ఈ పంపర పనస పండు అచ్చం బత్తాయిని పోలి, పరిమాణంలో కొంత పెద్దగా ఉంటుంది. పండు లోపల నిమ్మ, నారింజ, బత్తాయిలాగానే తొనలు ఉంటాయి. సిట్రస్ జాతికి చెందిన ఈ పండు కలర్ ఫుల్‌గా కనిపించడమే కాకుండా మంచి ఆరోగ్య లక్షణాలను కూడా కలిగి ఉంది. పంపర పనస పండుతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం



### రోగ నిరోధక శక్తి వృద్ధి
పంపర పనసలో విటమిన్-సి పుష్కలంగా ఉంటుంది. కాబట్టి ఈ పండు తినడంవల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. తరచూ ఈ పండును తింటుంటే అనారోగ్యాలు దరిచేరవు.

### గుండెకు మేలు
పంపర పనసలో పొటాషియం, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో సాయపడుతుంది. రక్తపోటు అదుపులో ఉంటే గుండె సంబంధ సమస్యలు సహజగానే అదుపులో ఉంటాయి. ఇక ఈ పండులోని ఫైబర్ కంటెంట్ కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. గుండెపోటు ప్రమాదాన్ని నియంత్రిస్తుంది.

### జీర్ణశక్తి మెరుగు
జీర్ణక్రియకు సాయపడే జీర్ణ ఎంజైమ్‌లు కూడా పంపర పనసలో పుష్కలంగా ఉంటాయి. కాబట్టి ఈ పండు తరచూ తీసుకుంటే జీర్ణశక్తి మెరుగుపడుతుంది. ఈ పండులోని ఫైబర్ కంటెంట్ మలబద్ధకాన్ని నివారిస్తుంది. ప్రేగు కదలికలను ప్రోత్సహిస్తుంది. దాంతో జీర్ణవ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తుంది.

### బరువు అదుపులో
పంపర పనస రుచిలో తియ్యగా ఉన్నప్పటికీ దీనిలో కేలరీలు తక్కువగా ఉంటాయి. కొవ్వు తక్కువ, ఫైబర్ ఎక్కువ ఉంటుంది. తీపి తినాలనే వారికి ఇది తృప్తిని ఇస్తుంది. అతిగా తినడాన్ని నివారిస్తుంది. బరువు తగ్గాలని అనుకునేవారు పంపర పనస తీసుకుంటే మంచి ప్రయోజనాలు ఉంటాయి.

### చర్మం ఆరోగ్యం
ఈ పండులో విటమిన్ సి, ఫ్లేవనాయిడ్స్ లాంటి యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటంవల్ల చర్మాన్ని ఆరోగ్యంగా, యవ్వనంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లు చర్మ కణాలను దెబ్బతీసే ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతాయి. ముడతలు, గీతలు లాంటి వృద్ధాప్య సంకేతాలను తగ్గించడంలో సాయపడుతాయి. ఈ పండును రెగ్యులర్‌గా తీసుకుంటే కొల్లాజెన్ ఉత్పత్తి పెరుగుతుంది. ఫలితంగా ప్రకాశవంతమైన చర్మం సొంతమవుతుంది.




## ఈ లక్షణాలు కనిపిస్తే అలర్ట్ అవ్వండి!

ప్రస్తుతం చాలా మంది మధుమేహంతో బాధపడుతున్నారు. అధిక రక్తంలో గ్లూకోజ్ స్థాయిని మధుమేహం అంటారు. ఇది శరీరం ఇన్సులిన్ హార్మోన్‌ను తగినంతగా ఉత్పత్తి చేయకపోవడం లేదా ఉత్పత్తి చేసే ఇన్సులిన్‌ను సమర్థవంతంగా ఉపయోగించలేకపోవడం వల్ల సంభవించే దీర్ఘకాలిక వ్యాధి. మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవడానికి సమయానికి మందులు తీసుకోవడం చాలా అవసరం. విపరీతమైన ఆకలి కారణంగా :మధుమేహ వ్యాధిగ్రస్తుల శరీర కణాలకు గ్లూకోజ్ అందుబాటులో ఉండదు . ఇది శక్తి కోసం మెదడుకు ఆకలి సంకేతాలను పంపుతుంది, మీరు ఎంత తిన్నా మళ్లీ ఆకలితో ఉంటుంది.

దాహం : రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉన్నప్పుడు, అదనపు గ్లూకోజ్ మూత్రంలోకి ప్రవేశిస్తుంది. ఇది రక్తంలోని నీటి శాతాన్ని తొలగిస్తుంది. ఇది నిర్జలీకరణానికి దారితీసే అధిక దాహానికి దారితీస్తుంది.

మూత్ర విసర్జన : మూత్రంలో అదనపు గ్లూకోజ్‌ను ఫిల్టర్ చేయడానికి మూత్రపిండాలకు ఎక్కువ నీరు అవసరం. ఇది తరచుగా మూత్రవిసర్జనకు దారితీస్తుంది.

బరువు తగ్గడం : కణాలు గ్లూకోజ్ పొందలేనప్పుడు, శరీరం శక్తి కోసం కొవ్వు ,కండరాలను విచ్ఛిన్నం చేయడం ప్రారంభిస్తుంది. ఇది త్వరగా బరువు తగ్గడంలో సహాయపడుతుంది.

చేతులు లేదా కాళ్లలో తిమ్మిరి : ఎక్కువ కాలం రక్తంలో చక్కెరను పెంచడం వల్ల నరాలు దెబ్బతింటాయి. దీన్ని డయాబెటిక్ న్యూరోపతి అంటారు. ఇది జలదరింపు, తిమ్మిరి , నొప్పిని కలిగిస్తుంది.

అస్పష్టమైన దృష్టి :రక్తంలో చక్కెర స్థాయిలు అధికంగా ఉండటం వలన కంటి చూపులో మార్పులకు కారణం కావచ్చు. ఇది దృష్టిని అస్పష్టం చేస్తుంది. ప్రతిగా, ఇది రెటీనాలోని రక్తనాళాలను దెబ్బతీయడం ద్వారా సమస్యను మరింత తీవ్రతరం చేస్తుంది.

గాయం : గ్లూకోజ్ స్థాయిలను పెంచుతుంది, రక్త ప్రసరణ , రోగనిరోధక పనితీరును దెబ్బతీస్తుంది. ఇది అల్సర్లు, గాయాలు , ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. ముఖ్యంగా చర్మం, చిగుళ్ళు, మూత్ర నాళాలపై ప్రభావం చూపుతుంది.

## గ్లోయింగ్ స్కిన్ కావాలా?

### ఈ అలవాట్లను అలవర్చుకోండి

నటీమణులను చూసి మీరు కూడా ఇలాగే ఆలోచిస్తారా?.. నాకు కూడా ఆమెలా మెరుస్తున్న చర్మం కలిగి ఉంటే బాగుండేదని. అవును అయితే, ఈ రోజు మనం అటువంటి మెరిసే చర్మాన్ని పొందే రహస్యాన్ని మీకు చెప్పబోతున్నాము. దీని కోసం మీరు ఎటువంటి ఖరీదైన చర్మ సంరక్షణ ఉత్పత్తికి డబ్బు ఖర్చు చేయనవసరం లేదు లేదా ఖరీదైన ఫేషియల్ చేయించుకోవలసిన అవసరం ఉండదు. మెరిసే చర్మం కలిగి ఉండాలంటే చర్మ సంరక్షణ లేదా మేకప్ మాత్రమే చేయాల్సిన అవసరం లేదు. మీ రోజువారీ అలవాట్లు మీ చర్మాన్ని కూడా ప్రభావితం చేస్తాయి. కాబట్టి, మీ చర్మానికి మేలు చేసే కొన్ని అలవాట్లను మీ జీవనశైలిలో చేర్చుకోవాలి.

మెరిసే చర్మం కోసం ఆరోగ్యకరమైన అలవాట్లు

వ్యాయామం-ప్రతిరోజూ కొంత సమయం పాటు వ్యాయామం చేయడం వల్ల మీ చర్మానికి చాలా మేలు జరుగుతుంది. ఇలా చేయడం వల్ల చర్మంలోని మురికి చెమట ద్వారా బయటకు వచ్చి రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. దీని వల్ల చర్మం మెరుస్తూ కనిపిస్తుంది.

సమయానికి నిద్రించండి-మీ రోజువారీ నిద్ర, మేల్కొనే సమయాన్ని నిర్ణయించుకుని దానిని అనుసరించండి. సెలవుల్లో కూడా ఒకే సమయంలో నిద్రించడానికి, మేల్కొలపడానికి ప్రయత్నించండి. ఇది మీ నిద్రను కూడా నిర్ధారిస్తుంది. మీ శరీరం సిర్కాడియన్ రిథమ్ నిర్వహించబడుతుంది. ఇలా చేయడం వల్ల చర్మం మెరుస్తుంది. మొటిమలు తగ్గుతాయి.

ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినండి- మన ఆహారం మన చర్మంపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది. కాబట్టి మీ



ఆహారంలో పచ్చి కూరగాయలు, పండ్లు, పెరుగు, చేపలు మొదలైన వాటిని చేర్చుకోండి. మీ ఆహారంలో విటమిన్ సి, ఇ, ప్రొటీన్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ అధికంగా ఉండే ఆహారాన్ని తప్పకుండా చేర్చుకోండి.

నీరు తాగండి-ప్రతిరోజూ సరైన మొత్తంలో నీరు తాగండి, తద్వారా మీ శరీరం డీహైడ్రేషన్ చెందదు. డీహైడ్రేషన్ కారణంగా మీ చర్మం పొడిగా, నిర్జీవంగా కనిపిస్తుంది.



## బుల్లయ్య కళాశాలలో ప్రొఫెసర్ శివయ్య శతజయంతి వేడుకలు

**విశాఖపట్నం, సెప్టెంబర్ 3, జయ జయహే**

డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల వ్యవస్థాపక కార్యదర్శి ప్రొఫెసర్ కె. వి. శివయ్య శత జయంతిని గురువారం కాలేజీ యాజమాన్యం ఘనంగా నిర్వహించింది. ఉన్నత విద్య, వాణిజ్య విద్య , మేనేజ్‌మెంట్ విద్య రంగాలకు ఆయన అందించిన చిరస్మరణీయ సేవలను స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించారు. కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, పుష్పాంజలి ఘటించారు. సంస్థ అభివృద్ధి మరియు విస్తరణలో ఆయన పోషించిన మార్గదర్శక పాత్రను ఈ సందర్భంగా వారు స్మరించుకున్నారు.కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ జి. మధు కుమార్ మాట్లాడుతూ ప్రొఫెసర్ శివయ్య దూరదృష్టి కలిగిన విద్యావేత్త అని, నాణ్యమైన ఉన్నత విద్యను అందరికి చేరువ చేయడంతో పాటు ఈ ప్రాంతంలో వృత్తి విద్యను బలోపేతం చేయడానికి కృషి చేశారని పేర్కొన్నారు. సొసైటీ ఫర్ కాలేజియేట్ ఎడ్యుకేషన్‌తో ప్రొఫెసర్ శివయ్యకు ఉన్న అనుబంధాన్ని, సంస్థ ప్రారంభ దశల్లో ఆయన పోషించిన కీలక పాత్రను డా. మధు కుమార్ గుర్తుచేశారు. విద్య పట్ల ఆయనకున్న అంకితభావం, విద్యార్థులకు అవకాశాలు కల్పించాలన్న నిబద్ధత కళాశాల ప్రారంభ అభివృద్ధికి విశేషంగా దోహదపడ్డాయని తెలిపారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎంబీఏ కార్యక్రమం స్థాపన మరియు విస్తరణలో ప్రొఫెసర్ శివయ్య పోషించిన కీలక పాత్రను కూడా ఆయన ప్రస్తావించారు. ఆయన దూరదృష్టి, చొరవ ఈ ప్రాంతంలో మేనేజ్‌మెంట్ విద్యను బలోపేతం చేయడంలో సహాయపడ్డాయని పేర్కొన్నారు. ప్రొఫెసర్ శివయ్య శతజయంతి వేడుకలు దూరదృష్టి కలిగిన ఈ మహనీయ విద్యావేత్తకు కళాశాల సమాజం ఘన నివాళి అర్పించే అవకాశాన్ని కల్పించాయి.

## 'డ్రైవ్ మోడ్'లో రెవెన్యూ సమస్యలకు పరిష్కారం

### ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి

### విశాఖ, భీమిలి రెవెన్యూ కాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

**విశాఖపట్నం, సెప్టెంబరు 3, జయ జయహే**

రెవెన్యూ శాఖకు సంబంధించిన దీర్ఘకాలిక, క్లిష్టమైన సమస్యల పరిష్కారానికి అధికారులు డ్రైవ్ మోడ్‌లో పనిచేయాలని విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశించారు. పెండింగ్ సమస్యలను నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించి ప్రజలకు సత్వర సేవలు అందించాలని సూచించారు. విశాఖపట్నం, భీమిలి రెవెన్యూ డివిజన్ల రెవెన్యూ కాన్ఫరెన్స్ గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా బల్క్ ఇష్యూస్, పెండింగ్ సమస్యలు, 22ఏ కేసులు, డీ-నోటిఫికేషన్, ఆక్రమణల క్రమబద్ధీకరణ, మాన్యువల్ దరఖాస్తుల పరిష్కార స్థితి తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరితో కలిసి ఆయన సమీక్షించారు. ప్రతి అంశానికి స్పష్టమైన టైమ్‌లైన్ నిర్దేశించుకుని లక్ష్యాలను సాధించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని, వాటర్ బాడీస్ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రజా ప్రయోజనాల కోసం భూములు కోల్పోయిన వారికి నిబంధనల ప్రకారం పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. 22ఏ కేసులు, డీ-నోటిఫికేషన్ అంశాల పరిష్కారంలో వారాంతపు లక్ష్యాలను నిర్దేశించుకుని పురోగతి సాధించాలన్నారు. పెండింగ్ సమస్యలను ప్రత్యేకంగా గుర్తించి వాటి పరిష్కారానికి డ్రైవ్ మోడ్ అనుసరించాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా అందుతున్న వినతులకు నాణ్యమైన, శాశ్వత పరిష్కారం అందించాలన్నారు. ఒకే సమస్యపై ప్రజలు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకుని, వాస్తవ పరిస్థితుల ఆధారంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు అధికారుల దృష్టికి రాని క్లిష్టమైన రెవెన్యూ సమస్యలు ఏమైనా ఉన్నాయా అనే అంశాన్ని వీఆర్వోల ద్వారా ప్రత్యేకంగా తెలుసుకుని



నివేదించాలన్నారు. ఆన్‌లైన్ సేవలను విస్తృతం చేయాలని సూచించారు. మెట్రో, రైల్వే తదితర కీలక అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి పూర్తి చేయడంతో పాటు ప్రతి అంశానికి టైమ్‌లైన్ ఏర్పాటు చేసుకుని నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జేసీతో పాటు, డీఆర్వో ఎం. విశ్వేశ్వరనాయుడు, ఆర్డీవోలు దిలీప్ చక్రవర్తి, సంగీత్ మాథుర్, డిప్యూటీ కలెక్టర్లు గోవిందు, అనిత, మాధవీలత, కలెక్టరేట్ ఏవో బీవీ రాణి, తహశీల్దార్లు, డీటీలు, కలెక్టరేట్ సెక్షన్ల సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com